VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 04.08.2026
సంపుటి : 09 సంచిక : 56 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com




## కేంద్రానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశం

- దేశంలో ప్రతి రహదారిపై పాదచారులకు ప్రత్యేక మార్గం
- రహదారులపై పాదచారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

# నిమ్స్ ఆస్పత్రిలో కొత్త చరిత్ర

- వెయ్యి రొబోటిక్ ఆపరేషన్స్ విజయవంతం
- సీఎం రేవంత్, మంత్రి దామోదర అభినందనలు
- రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ సర్జరీల ఘనత
- నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌కు అభినందనలు
- సామాన్యులకు అత్యాధునిక వైద్య సేవలు
- ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్న సీఎం
- 90 శాతానికి పైగా ఉచిత చికిత్సలు
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు పెద్ద దిక్కు
- రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల రికార్డు
- నిమ్స్ ఖాతాలో మరో అరుదైన మైలురాయి




**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ప్రభుత్వ బోధనాసుపత్రి నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. గత రెండున్నరేళ్ల స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించింది. ప్రభుత్వ రంగంలో అత్యంత క్లిష్టమైన, అత్యాధునిక రొబోటిక్ సర్జరీలను ఈ స్థాయిలో నిర్వహించి పేద రోగులకు అందించడం పట్ల రాష్ట్ర సర్కారు హర్షం వ్యక్తం చేసింది.ఈ గొప్ప విజయం సాధించిన సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు దీని వెనుక శ్రమించిన ప్రత్యేక వైద్య నిపుణుల బృందాన్ని, నర్సింగ్ సిబ్బందిని మరియు ఆపరేషన్ థియేటర్ టీమ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

▶ మిగతా 2లో

# మేడిగడ్డపై వ్యాఖ్యలు బీఆర్ఎస్ అజ్ఞానానికి నిదర్శనం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపాటు
- వరదల వేళ బిఆర్ఎస్ నాయకుల రాజకీయ లబ్ధి యత్నం
- అవన్నీ అసత్య ప్రచారాలేనని ఖండించిన మంత్రి అడ్లూరి
- సాగునీటి వ్యవస్థపై అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని విమర్శ
- రాజకీయ ప్రకటనలతో కాకుండా సాంకేతిక సూత్రాల ప్రకారమే పంపింగ్
- మేడిగడ్డ వేల కోట్ల తెలంగాణ ప్రజల సొమ్ము వృథాకు కారణమైంది వ్యాఖ్యలు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**

గోదావరి నదికి వరదలు వచ్చిన ప్రతిసారి బాధితుల



సమస్యలను పరిష్కరించడం పక్కనబెట్టి, కేవలం రాజకీయ ప్రయోజనాలు పొందడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ నుంచి తక్షణమే నీటిని ఎత్తిపో యాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్లు పూర్తిగా వాస్తవాలను వక్రీకరించడమేనని విమర్శించారు. సాగునీటి వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో కనీస జ్ఞానం కూడా లేకుండా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతు న్నారని, వారి అవగాహన రాహిత్యాన్ని ప్రజల ముందు మళ్లీ బయటపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు.

▶ మిగతా 2లో

# ఈ ఏడాది అతి భారీ వర్షాలు

- భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత
- సికింద్రాబాద్ రంగంలో భవిష్యవాణి
- మాతంగి స్వర్ణలత సంచలన హెచ్చరికలు
- ఈసారి భారీ వర్షాలతో అగ్నిప్రమాదాల ముప్పు
- మహంకాళి బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం
- విగ్రహ ప్రతిష్ఠ చేయకపోవడంపై అమ్మవారి ఆగ్రహం
- 6 నెలల గడువు విధించిన మాతంగి స్వర్ణలత

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**

సికింద్రాబాద్‌లోని ప్రముఖ క్షేత్రం ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో అత్యంత కీలకమైన, విశిష్టమైన 'రంగం' కార్యక్రమం అత్యంత శ్రద్ధాసక్తుల నడుమ వైభవంగా పూర్తయింది.




## డయాలసిస్ బాధితులను వికలాంగులుగా గుర్తించాలి




- పార్లమెంట్‌లో ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్
- ఆర్‌పిడబ్ల్యుడి చట్టం పరిధిని విస్తరించాలని ప్రతిపాదన
- హైదరాబాద్ చెరువులను జలాశయాలుగా మార్చాలని విజ్ఞప్తి

## పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరుతో కేటీఆర్ రాజకీయం: మంత్రి శీనన్న




- పదేండ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించింది బీఆర్ఎస్

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగాల తుది ఫలితాలు విడుదల




- 1,604 మంది అభ్యర్థుల ఎంపిక
- వెబ్‌సైట్‌లో ఫలితాలు లభ్యం
- ఆగస్టు 7 నుంచి 11 వరకు అటెస్టేషన్
- ఆకర్షణీయమైన వేతన స్కేలు
- ఆర్టీసీ సిబ్బందిపై తగ్గనున్న పని భారం
- కొత్త నియామకాలతో సంస్థకు భారీ ఊరట

## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- దీనిని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు–రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు అత్యున్నత ప్రాధాన్యం




- సుప్రీంకోర్టు తాజా తీర్పుతో అనుమతుల సాధనకు కొత్త అవకాశం

## మోడీ–షాలకు ఇక ఇంటి దారే...

- బంకిపూర్ ఉప ఎన్నిక తీర్పు బీజేపీ అహంకారానికి గట్టి దెబ్బ..
- మధ్యప్రదేశ్ లోని దతియ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజాస్వామిక విజయం...
- మధ్యప్రదేశ్ లో మీనాక్షి నటరాజన్ గారి రాజ్యసభ సీట్ చోరీ




చేసినందుకు బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారు..

## నిజామాబాద్ జీజీహెచ్‌కి సరికొత్త రూపం




- ప్రధాన రిఫరల్ ఆస్పత్రిగా అభివృద్ధికి ప్రణాళికలు
- సూపర్ స్పెషాలిటీ సేవలు త్వరలోనే ప్రారంభం
- మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రకటన
- అత్యాధునిక ఎంఆర్ఐ పరికరం అందుబాటులోకి

## ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి

- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయం
- మొన్న నైనీ ప్రారంభించాం, నిన్న తాడిచర్ల-2 బ్లాక్ కు మైనింగ్ లీజు సంపాదించాం
- నేడు మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్‌ను సింగరేణికి దక్కేలా చూశాం
- నెల వ్యవధిలో సింగరేణికి రెండు చారిత్రక విజయాలు నమోదు
- మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ నుంచి ఏటా 6 మిలియన్ల చొప్పున 20 ఏళ్లు 120 మిలియన్ టన్నుల జీ-8 నాణ్యమైన బొగ్గు వెలికితీతకు అవకాశం




- 2 వేల మంది ఉపాధికి భద్రత.. మణుగూరు ఏరియాకు మరో 20 ఏళ్ల భరోసా

# నిమ్స్ ఆస్పత్రిలో కొత్త చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అత్యంత విలువైన, అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనే తమ ప్రజా ప్రభుత్వ సంకల్పం ఈ ఫలితంతో నెరవేరిందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన ఈ వెయ్యి రొబోటిక్ సర్జరీల్లో దాదాపు 90 శాతానికి పైగా చికిత్సలను 'ఆరోగ్యశ్రీ' మరియు 'ముఖ్యమంత్రి సహాయ నిధి' (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా అందించడం అత్యంత ప్రశంసనీయమైన విషయమని ముఖ్యమంత్రి కొనియాడారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఈ చికిత్సలను పేదలకు ఉచితంగా అందించి వారి ప్రాణాలను కాపాడారని తెలిపారు.ఇటీవలే నిమ్స్ ఆస్పత్రి విజయవంతంగా 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసి రికార్డు సృష్టించగా, ఇప్పుడు దానికి కొనసాగింపుగా వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని అధిగమించిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ విధంగా ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతూ, వైద్య రంగంలో నిమ్స్ సంస్థ మరిన్ని కొత్త మైలురాళ్లు దాటాలని, మున్ముందు అనేక రికార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.మరోవైపు, తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ డైరెక్టర్, సర్జన్ల బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులు సాంకేతికంగా ఏమాత్రం వెనుకబడి లేవని, నిమ్స్ సాధించిన ఈ ఘనతే దానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.దక్షిణ భారతదేశంలోనే ప్రభుత్వ రంగంలో తొలిసారిగా రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ (మూత్రపిండ మార్పిడి) నిర్వహించిన ఘనత నిమ్స్ ఆస్పత్రికే దక్కుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. నిమ్స్‌లో నిర్వహించిన ఈ వెయ్యి రొబోటిక్ సర్జరీల విశ్లేషణను చూస్తే.. యూరాలజీ విభాగంలో 590, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, అలాగే ఆంకాలజీ (క్యాన్సర్) విభాగంలో 162 శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగాయని వివరించారు.కేవలం నిమ్స్‌కే పరిమితం కాకుండా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలోనూ రొబోటిక్ సర్జరీలు విజయవంతంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని ఇతర ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా మరియు నూతనంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రుల్లో కూడా అత్యాధునిక రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.తెలంగాణలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తేవడమే తమ ప్రభుత్వ ప్రాథమిక ధ్యేయమని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతను ప్రభుత్వ వైద్యంలోకి పెద్దపీట వేస్తూ, మౌలిక వసతులను మరింత విస్తరిస్తామని భరోసా ఇచ్చారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరుతో కేటీఆర్ రాజకీయం: మంత్రి శీనన్న

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు..?పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వం.

ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం... అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం...కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య.మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం.

# ఈ ఏడాది అతి భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంలో పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత రాబోయే కాలం గురించి పలు కీలక హెచ్చరికలు చేశారు. ఈ ఏడాది దేశంలో, రాష్ట్రంలో కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని, భారీ వరదల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని చెప్పారు. అగ్ని ప్రమాదాలు, భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.భవిష్యవాణి వినిపించే క్రమంలో మాతంగి స్వర్ణలత తన అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో తన విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని గతంలో మాట ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదని మండిపడ్డారు. తాను ప్రజలందరినీ కాపాడుతున్నప్పటికీ, తన మాటను ఎవరూ ఆచరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు అడ్డుపడినా సరే ఈసారి విగ్రహ ప్రతిష్ఠ చేయించుకుని తీరుతానని స్పష్టం చేశారు. సరైన సమయానికి విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు."నేను ఈ రోజు సంతోషంగా రాలేదు, తీవ్రమైన కోపంతో వచ్చాను. నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని చెప్పి మాట తప్పారు. అలాంటప్పుడు మీ ప్రశ్నలకు సమాధానాలు ఎందుకు చెప్పాలి? ఈ ఏడాది కుంభవర్షాలు ముంచెత్తుతాయి. ఆ వర్షాలకు ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి వస్తుంది. ప్రాణనష్టం, అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. నా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే ప్రజల కోరికలన్నీ నెరవేరుస్తాను. ఆరు నెలల వ్యవధిలో విగ్రహ ప్రతిష్ఠ జరగకపోతే వాడవాడలా ప్రాణనష్టం కలిగిస్తాను" అని మాతంగి స్వర్ణలత హెచ్చరించారు.సమాజంలో మానవ సంబంధాలు, వావివరుసలు తగ్గిపోతున్నాయని, జనాలు ధర్మాన్ని మరిచి ప్రవర్తిస్తున్నారని భవిష్యవాణిలో స్వర్ణలత పేర్కొన్నారు. ప్రజల్లో సంతోషం కరువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రజలకు దోసెడంత ఇస్తుంటే, తన కోసం మాత్రం గోరంత కూడా చేయడం లేదని అన్నారు. అయితే పిచిన్న పిల్లలను, తనను నమ్ముకున్న ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అభయమిచ్చారు. ఆరు నెలల్లో విగ్రహం పెట్టకపోతే అడ్డొచ్చిన వారిని తొక్కిపారేస్తానని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.రంగం కార్యక్రమం అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ ఏడాది రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, అమ్మవారి దయాకటాక్షాలు ప్రజలందరిపై ఉంటాయని మాతంగి భవిష్యవాణిలో తెలిపారని అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. భక్తుల రద్దీ ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటం వల్ల కొంత ఒత్తిడి ఏర్పడిందని తెలిపారు.జోగినీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం తెలిపారు. తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని జోగినీలు కోరారని, భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. మిగిలిన పాతబస్తీ, లాల్ దర్వాజా బోనాలలోనూ మెరుగైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ లష్కర్ బోనాల ఉత్సవాలను దేశవ్యాప్తంగా ప్రజలు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించారని తెలిపారు. నిన్న ఉదయం నుంచి వేలాది మంది భక్తులు, మహిళలు నిష్ఠతో అమ్మవారికి బోనాలు సమర్పించారని చెప్పారు. రంగం భవిష్యవాణి కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిందని, అనంతరం అమ్మవారి అంబారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు వివరించారు.ఉజ్జయిని మహంకాళి దేవాలయానికి 200 ఏళ్లకు పైగా ఘనమైన సాంస్కృతిక చరిత్ర ఉందని, తరతరాలుగా ఇక్కడ బోనాల పండుగను ఎంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తలసాని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

# దయాలసిస్ బాధితులను వికలాంగులుగా గుర్తించాలి

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 3:**

కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ నిరంతరం డయాలసిస్ చేయించుకుంటున్న పేషెంట్లను కూడా వెంటనే వికలాంగుల జాబితాలోకి చేర్చాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం జరిగిన చర్చలో ఆయన ఈ ప్రతిపాదనను లేవనెత్తారు. 2016వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం తీసుకువచ్చిన 'రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్' (ఆర్‌పిడబ్ల్యుడి) చట్టం కింద ఇప్పటికే తలసీమియా, సికిల్ సెల్ వంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారిని చేర్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహాలో డయాలసిస్ రోగుల స్థితిగతులను కూడా గుర్తించి, వారిని ఈ చట్టం పరిధిలోకి తీసుకురావాలని కోరారు.డయాలసిస్ బాధితుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు నెలకు దాదాపు 12 నుంచి 13 సార్లు డయాలసిస్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ప్రభుత్వాలు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఆస్పత్రులకు వెళ్లడానికి అయ్యే రవాణా ఖర్చులు, ఇతర అత్యవసర మందుల కోసం నెలకు కనీసం రూ.15 వేల వరకు సొంతంగా వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఇది తీవ్రమైన ఆర్థిక భారంగా మారుతోందని చెప్పారు. రోజురోజుకీ దేశంలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరిగిపోతున్నందున, వారిని ఆర్‌పిడబ్ల్యుడి యాక్ట్ కింద చేర్చి ప్రభుత్వపరంగా తగిన ఆర్థిక, సామాజిక భరోసా అందించాలని లోక్‌సభలో నిబంధన 377 కింద తాను కోరినట్లు ఈటల రాజేందర్ మీడియాకు వెల్లడించారు.మరోవైపు హైదరాబాద్ నగరంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ వల్ల ప్రకృతి సిద్ధమైన జల వనరులు నాశనమవుతున్నాయని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. నగరం చుట్టూ ఉన్న వాగులు, వంకలు, కుంటలు, చెరువులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆరోపించారు. మిగిలిన చెరువులు డ్రైనేజీ వ్యర్థాలు, పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాల వల్ల పూర్తిగా మురికి కూపాలుగా మారిపోయాయని ధ్వజమెత్తారు. వీటి కారణంగా గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయి, దోమలకు నిలయాలుగా మారడమే కాకుండా, పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కూడా తీవ్రంగా కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. డ్రైనేజీ, రసాయన వ్యర్థాల నీరు చెరువుల్లో కలవకుండా దారిమళ్లించాలని, కేవలం వర్షపు నీటితో మాత్రమే నింపి వాటిని మంచినీటి చెరువులుగా తీర్చిదిద్దాలని పార్లమెంట్‌లో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారం చేపట్టిన రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయలేదని, రైతులకు ఇస్తామన్న రైతుబంధు సాయాన్ని కూడా పూర్తిగా అందించలేదని మండిపడ్డారు.నిరుద్యోగ యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లను ఇవ్వడం లేదని, మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి వంటి పథకాల హామీలు నెరవేరలేదని ఈటల విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించడం నిలిపివేశారని ధ్వజమెత్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా, ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఈ తరహా మోసపూరిత వైఖరి వల్ల భవిష్యత్తులో ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని జోస్యం చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' వ్యవస్థపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా అనేది సామాన్య ప్రజలను తీవ్రంగా వేధించే ఒక రక్షక భట వ్యవస్థగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వాలకు విచక్షణాధికారాలు ఉండవచ్చు కానీ, నిరుపేదల ఇళ్లను అక్రమంగా కూలగొట్టే హక్కు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు.గతంలో లక్షలాది మంది ప్రజలను హింసించిన నియంత హిట్లర్ ఏర్పాటు చేసుకున్న కమిటీ పేరునే గుర్తుచేసేలా ఈ ప్రభుత్వం 'హైడ్రా'ను తీసుకువచ్చిందని ఎద్దేవా చేశారు.దశాబ్దాల క్రితం నగరానికి వచ్చి, ఎంతో కష్టపడి చిన్న ఇల్లు నిర్మించుకున్న పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ వాపోయారు. హైడ్రా బాధితుల ఆవేదన మాటల్లో చెప్పలేనిదని అన్నారు. హైడ్రా బుల్డోజర్ల భయంతో నల్లచెరువు వద్ద బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుందని, అలాగే జొన్నలబండ వద్ద వడ్డెర కుటుంబాల ఆర్తనాదాలు సమాజాన్ని తీవ్రంగా కలిచివేశాయని గుర్తుచేశారు. పేదల ఇళ్లను కూల్చివేస్తూ, తమకు అనుకూలంగా ఉన్న బడా బాబులకు భూములను కట్టబెట్టేందుకే ప్రభుత్వం హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటోందని ధ్వజమెత్తారు.అధికారులు దాదాపు 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా మరియు దాని అధికారులను సమర్థిస్తున్నారని ఈటల విమర్శించారు. నగరంలో 95 ￼శాతానికి పైగా ప్రజలు ఈ హైడ్రా పేరు వింటేనే భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. చివరికి 'లేక్ వ్యూ' అని పేరు పెట్టుకోవడానికి కూడా ప్రజలు భయపడే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని వ్యాఖ్యానించారు. చట్టాలను, న్యాయస్థానాలను బేఖాతరు చేస్తూ సాగుతున్న ఈ వేధింపుల చర్యలు తక్షణమే ఆపాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

ప్రజా ప్రభుత్వంలో సింగరేణి పరిరక్షణ, విస్తరణతోపాటు రాష్ట్ర ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న సంకల్పంతో గత 30 నెలలుగా అవిశ్రాంతంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తూ సింగరేణికి కొత్త ఊపిరి లభిస్తోందని, ఈ రోజు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియా అస్తిత్వానికి అతి కీలకమైన పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క అభివర్ణించారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడుకోవడానికి కొత్త బ్లాక్‌లను దక్కించుకోవాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు.. సింగరేణికి అందిస్తున్న సహకారం వల్లే ఈ రోజు ఈ విజయం సాధ్యమైందన్నారు. అసలు ప్రారంభం అవుతుందా లేదా తెలియని స్థితిలో ఉన్న ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుమతులు సాధించేందుకు తానే ఒడిశాకు వెళ్లి అక్కడి ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి ఒప్పించానని, ఫలితంగా ఈ రోజు 36 ఏళ్ల పాటు సంస్థకు బలమైన పునాది వేసే నైనీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు.అదే సమయంలో 2013 లో యూపీఏ హయాంలో మైనింగ్ అనుమతులు జారీ చేసిన తాడిచర్ల -2 బొగ్గు బ్లాక్‌ను గత బీఆర్ఎస్ పాలకులు విస్మరిస్తే తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో సంప్రదింపులు జరిపి గత నెల రెండో వారంలో మైనింగ్ లీజులు జారీ చేయించామని తెలిపారు. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను 45 ఏళ్ల పాటు వెలికితీయడానికి అవకాశం ఉంటుందన్నారు.తాజాగా సోమవారం రోజున (సోమవారం) కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన వేలంలో సింగరేణి పాల్గొని మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ ను దక్కించుకుందని, గత పాలకులు సింగరేణి సంస్థను వేలంలో పాల్గొనకుండా నిరోధించి మన రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాక్‌లను వారి అస్మదీయులకు కట్టబెట్టే కుట్రలు చేశారని, తాము సింగరేణి మనుగడ కోసం వేలంలో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వడం వల్లే ఈ రోజు సింగరేణికి దాదాపు 12 ఏళ్ల తర్వాత వేలంలో ఒక బ్లాక్ దక్కిందని తెలిపారు. ఇది ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో నమోదైన ప్రజా విజయంగా అభివర్ణించారు. గత నెల రోజుల వ్యవధిలో సింగరేణిలో నమోదైన రెండో అతి పెద్ద విజయంగా పేర్కొన్నారు. మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ గనితో 120 మిలియన్ టన్నుల నాణ్యమైన జీ-8 గ్రేడ్ బొగ్గును వెలికితీయొచ్చని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును మన విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు,మరీ ముఖ్యంగా, సింగరేణిలో అత్యంత కీలకమైన ఏరియాల్లో ఒకటైన మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని పరిరక్షించడంలో ఈ బ్లాక్ కీలక పాత్ర పోషించనుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభించడమే కాకుండా, మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే, ఈ బ్లాక్‌లోని నాణ్యమైన బొగ్గు నిల్వల ద్వారా రాబోయే 20 సంవత్సరాల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయడంతో రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం-3 మరియు సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు.

# మేడిగడ్డపై వ్యాఖ్యలు బీఆర్ఎస్ అజ్ఞానానికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ మరియు పంపింగ్ ప్రక్రియలు అనేవి రాజకీయ సభల్లో చేసే మైకు ప్రకటనలతో సాధ్యమయ్యేవి కావని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జలాశయాల్లోని నీటి మట్టాలు, మోటార్ల పంపింగ్ సామర్థ్యం, ప్రధాన కాలువల నీటిని మోయగల పరిమితి, దిగువన ఉండే ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యం, విద్యుత్ లభ్యతతో పాటు నీటిపారుదల శాఖ ఇంజినీర్ల సాంకేతిక అనుమతులు, భద్రతా ప్రమాణాల ఆధారంగానే నీటి విడుదల నిర్ణయాలు జరుగుతాయని వివరించారు. ఈ కనీస ధర్మాలు తెలియకుండా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం శోచనీయమన్నారు.ప్రజాధనంతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి ఎంతమాత్రం లేదని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల కష్టార్జితమైన వేల కోట్ల రూపాయలను వెచ్చించి నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ నేడు గుల్లై, కూలిపోయే స్థితికి ఎందుకు చేరిందో ముందుగా ఆ పార్టీ నాయకులే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో జరిగిన ఘోరమైన లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల రాష్ట్ర ఖజానాపై పడిన భారీ భారం గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు అదే ప్రాజెక్టు పేరు చెప్పి ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించాలని చూడటం వారి రాజకీయ దివాళాకోరుతనానికి అద్దం పడుతోందన్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారా నీటిని తరలించే అంశంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు వారి అజ్ఞానాన్ని బయటపెడుతున్నాయని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, భౌగోళిక పరిస్థితుల ప్రకారం ఎక్కడ గ్రావిటీ సాధ్యమవుతుందో అక్కడ గ్రావిటీ ద్వారా, ఎక్కడ సాంకేతికంగా అవసరమో అక్కడ ఎత్తిపోతల (లిఫ్ట్) ద్వారా నీటి తరలింపు జరుగుతుందని, ఇది పూర్తిగా ఇంజనీరింగ్ సాంకేతిక అంశమని స్పష్టం చేశారు. గతంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామని తెలంగాణ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన బీఆర్ఎస్, తన పదేళ్ల సుదీర్ఘ పాలనలో ఆ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలని సవాలు విసిరారు.తమ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు నిరంతర సాగునీరు, ప్రజలకు సరిపడా తాగునీరు అందించేందుకు పూర్తి శాస్త్రీయ విధానంలో ప్రాజెక్టుల నిర్వహణ చేపడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రచారాల కోసం కాకుండా, జలవనరుల నిపుణుల సలహాలు, సాగునీటి శాఖ ఇంజినీర్ల సాంకేతిక సూచనలు, భద్రతా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ప్రతి నిర్ణయాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు. బీఆర్ఎస్ లాగా ప్రజాధనాన్ని నీళ్లపాలు చేసే అలవాటు కాంగ్రెస్‌కు లేదన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు ప్రశ్నలు సంధించారు. మేడిగడ్డ బ్యారేజీ నేడు కుంగిపోయి ఈ దుస్థితికి రావడానికి అసలు బాధ్యులు ఎవరు?, నిర్మాణ నాణ్యతలో జరిగిన లోపాలపై వస్తున్న ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం ఎందుకు దాటవేస్తోంది?, ప్రాజెక్టుల భద్రత, ప్రజల ప్రాణాల కంటే మీ రాజకీయ లబ్ధే ముఖ్యమా?, గోదావరి వరదలు తెచ్చిన కష్టాలను కూడా రాజకీయ ప్రచారానికి వాడుకోవడం రైతుల పట్ల బాధ్యతాయుతమైన చర్యేనా?, పదేళ్ల పాలనలో నెరవేర్చని హామీలపై ప్రజలకు ఎప్పుడు వివరిస్తారు? అని వరుసగా నిలదీశారు.తమ స్వార్థం కోసం మేడిగడ్డ ప్రాజెక్టును దెబ్బతీసిన వారే ఈరోజు అదే మేడిగడ్డపై నీతులు చెప్పడానికి ముందుకు రావడం చరిత్రను మర్చిపోవడమేనని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకుని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ నిర్ణయాలకు సహకరించాలని హితవు పలికారు.

# మోడీ–షాలకు ఇక ఇంటి దారే...

- **టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నిక ఫలితం కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితం కాదు. ఇది దేశ రాజకీయాల్లో ఒక కీలక మార్పు నాకు సంకేతం.కేంద్రంలోనూ, బీహార్‌లోనూ అధికారంలో ఉన్న బీజేపీ నియంతృత్వ విధానాలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు..బంకిపూర్ సాధారణ శాసనసభ స్థానం కాదు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో రాజీనామా చేసిన నియోజకవర్గం. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానం ప్రజల తీర్పుతో చేజారడం అధికార అహంకారానికి ఎదురుదెబ్బ.ప్రజల తీర్పు స్పష్టంగా చెబుతోంది. అధికార దుర్వినియోగం, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఇబ్బందులు, సామాజిక విభజన రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు.ఎంత బలమైన రాజకీయ కోట అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని బంకింపూర్ మరోసారి నిరూపించింది.బీజేపీ అగ్ర నాయకత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ స్థానంలో ఎదురైన పరాజయం దేశవ్యాప్తంగా రాజకీయ సందేశాన్ని ఇస్తోంది. ప్రజల విశ్వాసాన్ని గెలవాలంటే ప్రచారం కాదు, పాలనలో ఫలితాలు చూపాల్సిందేనని ఈ తీర్పు చెబుతోంది.దేశ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు వస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోంది.

రాబోయే కాలంలో దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ మరింత బలపడుతుందనే విశ్వాసాన్ని ఈ ఫలితం కలిగిస్తోంది.బంకింపూర్ ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు.ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం ఎప్పుడూ ప్రజలదే...అలాగే మధ్యప్రదేశ్ లో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికి ఉప ఎన్నికల్లో దతియా సీట్ కాంగ్రెస్ దక్కించుకోవడం ప్రజాస్వామిక విజయం.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయండి

- రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లు పరిశీలన

**హైదరాబాద్, వెలుతురు, ఆగష్టు 03:**


తెలంగాణ రక్షణ సేన నిర్వహిస్తున్ ''సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. స్టేడియంలో వేదిక ఏర్పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తల సీటింగ్, స్టేడియంలో ఆవరణలో పార్కింగ్ సహా ఇతర ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు. ఈనెల 6న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా పలువురు ప్రముఖులు పాల్గొని సామాజిక న్యాయ తెలంగాణ సాధన దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

### సబ్బండ వర్గాలకు కవితమ్మతోనే న్యాయం: టీఆర్‌ఎస్ నాయకులు

సబ్బండ వర్గాలకు కవితమ్మనే న్యాయం చేస్తారని తెలంగాణ రక్షణ సేన నాయకులు పేర్కొన్నారు. సోమవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎల్‌బీ నగర్ ఇంచార్జ్ నరేశ్ ప్రజాపతి, టీఆర్‌ఎస్ నాయకులు కోల శ్రీనివాస్, అర్చన సేనాపతి, ఎత్తరి మారయ్య మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అన్ని వర్గాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం దక్కాలనే సంకల్పంతో టీఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పని చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలనే ఉద్దేశంతో ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు కూడా శాసన మండలి, అసెంబ్లీ వైపు చూడని ఎన్నో కులాల గురించి శాసన మండలిలో కవిత ప్రస్తావించిన అంశాలను వారు గుర్తు చేశారు.



# మత్స్యకారుల సంక్షేమానికి రూ. 116 కోట్ల విడుదల



GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Budget Estimates 2026-27 - Budget Release Order for Rs. 116,00,00,000/- to FISHERIES, HOD Orders - Issued.

FINANCE (EBSII) DEPARTMENT

BRO No : 1307 — Dated: 31-07-2026
Read the following:-

G.O.Ms.No.59, Finance (BG.I) Department, dt. 30-03-2001
G.O.Ms.No.31, Finance (BG) Department, dt. 31-03-2026
C.NO.4060309-A/257/A2/EBS.II/2026, FINANCE (EBS-II) DEPT.., dt. 31-07-2026

*****

ORDER:

In pursuance of the orders issued in references read above, the FISHERIES, HOD is hereby issued a Budget Release Order for an amount of Rs. 116,00,00,000/- (One Hundred Sixteen Crore Only) Scheme As Additional Funds towards Stocking of Fish Seed/Prawn Juveniles in water bodies for the year 2026-27, in relaxation of Treasury Control and Quarterly Regulation orders pending provision of funds by way of obtaining supplementary estimates at appropriate time during the F.Y 2026-27 under the following scheme.

(Rs. in Lakhs)

| SrNo | Head of Account | Charged/ Voted | Provision in BE 2026-27 | Additional Amounts Sanctioned | Amounts Reappropriated Authorized | Total Provision in BE 2026-27 | Amount Already Authorised | Amount Authorised Now | Balance Amount Available |
|---|---|---|---|---|---|---|---|---|---|
| Scheme Name: Development of Fisheries<br>Procedure of Drawl of Funds: Grants-in-aid Bill<br>Drawing Officer: Concerned DDO<br>Remarks: | | | | | | | | | |
| 1 | 2405-00-101 -25-25-310 -312 | V | 18,94.00 | 116,00.00 | 0 | 134,94.00 | 0 | 116,00.00 | 18,94.00 |
| Total BRO | | | 18,94.00 | 116,00.00 | 0 | 134,94.00 | 0 | 116,00.00 | 18,94.00 |

The (ANIMAL HUSBANDRY, DAIRY DEVELOPMENT & FISHERIES, SECRETARIAT DEPARTMENT). Shall take necessary action for issue of administrative sanction as per instructions issued in U.O Note No. 29875-A/1283/A1/BG.I/2006, Finance (BG.I) Department, dt.25.11.2006.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

SANDEEP KUMAR SULTANIA
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
ANIMAL HUSBANDRY, DAIRY DEVELOPMENT & FISHERIES, SECRETARIAT DEPARTMENT
FISHERIES, HOD
The Director of Treasuries & Accounts, Telangana, Hyderabad
The Director Works and Accounts, Telangana, Hyderabad
The Pay & Accounts Officer, Telangana, Hyderabad
The Accountant General, Telangana, Hyderabad
The Reins(Budget Computers)
The Finance (BG) Department
SF/SC.

// FORWARDED BY ORDER //

SECTION OFFICER.



- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ నాయకత్వానికి కృతజ్ఞతగా పాలాభిషేకం

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 3:**

తెలంగాణ రాష్ట్ర ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న బీసీ బిడ్డ, గౌరవ మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ గారు మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.

ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారితో చర్చించి, మత్స్యకార కుటుంబాల అభ్యున్నతినే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా తీసుకుని రూ.116 కోట్లను మత్స్యకారుల సంక్షేమం కోసం విడుదల చేయించడం పట్ల రాష్ట్రంలోని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు, గౌరవ మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ గారికి రాష్ట్రంలోని ప్రతి మత్స్యకారుడు కృతజ్ఞతలు తెలియజేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీ భీమ లక్ష్మణ్ ముదిరాజ్ గారు పిలుపునిచ్చారు.అనంతరం హైదరాబాద్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే గారు, గౌరవ రాహుల్ గాంధీ గారు, తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు, అలాగే తెలంగాణ రాష్ట్ర గౌరవ మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ గారి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆనందం వ్యక్తం చేశారు.

# నోరు అదుపులో పెట్టుకో కేటీఆర్..

- ముఖ్యమంత్రిని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు
- ప్రజా పరీక్షలో పాసైన లీడర్ రేవంత్‌రెడ్డి
- ఇంజనీర్లపై మీది ముమ్మాటికీ సవతి ప్రేమే..
- గతంలో 709 మందిని ఎలా తొలగించావో సమాధానం చెప్పు.?
- కేటీఆర్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ ఫైర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు కంటే పెద్ద పోటీ పరీక్ష మరొకటి లేదని.. రేవంత్ రెడ్డి గత రెండు దశాబ్దాలుగా ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన "ప్రజాక్షేత్రం అనే పరీక్ష"లో పదేపదే ఉత్తీర్ణులవుతూ వస్తున్నారన్నారు. జడ్పీటీసీ స్థాయి నుంచి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న గొప్ప నాయకుడని ఆమె కొనియాడారు. తండ్రి చాటున రాజకీయాల్లోకి వచ్చిన కేటీఆర్‌కు, ప్రజల మధ్య ఉండి రాసే "ప్రజా పరీక్ష" విలువ తెలియదంటూ ఇందిరాశోభన్ చురకలంటించారు.పరీక్ష ఫారాలు నింపడం, విదేశీ డిగ్రీలు ఉండటం మాత్రమే అర్హతని బీఆర్‌ఎస్ నాయకుల "ఎలైటిస్ట్ (దొరల) మనస్థత్వానికి" నిదర్శమని ఆమె మండిపడ్డారు. చదువుకున్న ప్రతి నిరుద్యోగి కష్టాన్ని గుర్తించే మనసు ఉండాలి కానీ, ఇతరుల విద్యాభ్యాసాన్ని చులకన చేసి మాట్లాడటం అంటే గ్రామీణ, సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన నాయకులను అవమానించినట్లేనని ఇందిరాశోభన్ వ్యాఖ్యానించారు. డిగ్రీలు చూపిస్తూ రాజకీయాలు చేయడం కాదు, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని వారి కోసం పనిచేయడం నాయకత్వానికి అసలైన ప్రమాణమన్నారు. తమకు ఫారాలు నింపడం వచ్చు.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపడం కూడా వచ్చని, అందుకు అనుగుణంగానే బీఆర్‌ఎస్ హయాంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోందని ఇందిరాశోభన్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో 1.11 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తే.. ఎలాంటి లీకులకు తావులేకుండా కేవలం రెండున్నరేళ్ల ప్రజా పాలనలో దాదాపు లక్ష ఉద్యోగాలను పారదర్శంగా భర్తీ చేశామని గుర్తుచేశారు.టీఎస్‌పీఎస్సీ పరీక్షల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీకులు లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును దెబ్బతీశాయని ఇందిరాశోభన్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో పరీక్షలు రద్దవడం, అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడటం బీఆర్‌ఎస్ వైఫల్యానికి నిదర్శనమన్నారు. నిజంగా కేటీఆర్‌కు ఇంజనీర్లపై చిత్తశుద్ధి ఉంటే 2020 జులైలో 709 మంది మిషన్ భగీరథ ఉద్యోగులను ఎలాంటి నోటీసులు, జీతభత్యాలు చెల్లించకుండా ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలన్నారు. ఇంజనీర్లపై మీ సవతి తల్లి ప్రేమేంటో ఈ ఘటనతో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ యువత స్కిల్ వైపు వెళ్లాలని, నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి తండ్రిలాగా చెప్పిన మాటలను కూడా వక్రీకరించి.. కేటీఆర్ రాజకీయ పైశాచిక ఆనందం పొందడం సిగ్గుచేటన్నారు ఇందిరాశోభన్.రాజకీయాల్లో డిగ్రీల సర్టిఫికెట్లు కాదు... ప్రజలకు చేసిన సేవ, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే అసలైన సర్టిఫికేట్ అని, అది రేవంత్ రెడ్డి ఎప్పుడో సాధించారన్నారు. పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న వారికి, ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తున్న ముఖ్యమంత్రిని ప్రశ్నించే నైతిక హక్కు ఎక్కడిదని ఆమె ప్రశ్నించారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని.. మరోసారి రేవంత్‌రెడ్డి గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజాక్షేత్రంలోనే తగిన గుణపాఠం చెబుతామని ఇందిరాశోభన్ హెచ్చరించారు.



# మేడిగడ్డను కూల్చి... ఇప్పుడు గోదావరిపై రాజకీయాలా?

- ప్రాజెక్టులను శిథిలం చేసిన వారికే ఇప్పుడు సాగునీటిపై ప్రేమ పుట్టడం ప్రజలను మోసం చేయడమే
- గోదావరి వరదలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న భారాస నేతలు ముందుగా తమ వైఫల్యాలకు సమాధానం చెప్పాలి
- భారాస నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

గోదావరిలో వరదలు వస్తే చాలు... ప్రజల కష్టాలపై స్పందించాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం అబద్ధాల ప్రచారం చేయడం భారాస నాయకులకు అలవాటుగా మారిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, BRS నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ....మేడిగడ్డ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని భారాస నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించడమేనని, సాగునీటి వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారనే విషయాన్ని మరోసారి నిరూపించుకున్నారని విమర్శించారు. గోదావరిలో వరద ప్రవాహం ఉందని చెప్పడం ఒకటి... ఆ నీటినంతా వెంటనే ఎత్తిపోసే అవకాశం ఉందని చెప్పడం మరోటి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అనేది రాజకీయ సభల్లో చేసే ప్రకటనలతో కాదు... నీటి మట్టాలు, పంపింగ్ సామర్థ్యం, కాలువల మోయగల సామర్థ్యం, దిగువ జలాశయాల నిల్వలు, విద్యుత్ లభ్యత, ఇంజినీర్ల సాంకేతిక అనుమతులు, భద్రతా ప్రమాణాల ఆధారంగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

### మేడిగడ్డ గురించి మాట్లాడే నైతిక హక్కు భారాసకు లేదు

తెలంగాణ ప్రజల సొమ్ముతో వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ నేడు ఎందుకు ఈ పరిస్థితికి చేరిందో ముందుగా భారాస నాయకులే సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

మేడిగడ్డ నిర్మాణంలో జరిగిన లోపాల వల్లే రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందన్న విషయం దేశమంతా చర్చించిందని, ఇప్పుడు అదే ప్రాజెక్టు పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు.

### గ్రావిటీ... ఎత్తిపోతలు రెండూ ఒకటి కావు

ఎల్లంపల్లి నుంచి గ్రావిటీ ద్వారా నీటి తరలింపుపై భారాస నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వారి అవగాహన రాహిత్యాన్ని బయటపెడుతున్నాయని మంత్రి అడ్లూరి అన్నారు.ప్రాజెక్టుల రూపకల్పన ప్రకారం ఎక్కడ గ్రావిటీ సాధ్యమో అక్కడ గ్రావిటీ ద్వారా, ఎక్కడ అవసరమైతే అక్కడ ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు జరుగుతుందని, ఇది పూర్తిగా సాంకేతిక అంశమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

### పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారు?

తుమ్మిడిహెట్టి పేరుతో తెలంగాణ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన భారాస... పదేళ్ల పాలనలో ఆ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని మంత్రి ప్రశ్నించారు.

అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనులను ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనన్నారు.

### రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా ప్రభుత్వం లో ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందేలా శాస్త్రీయ విధానంలో ప్రాజెక్టుల నిర్వహణకు



ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అడ్లూరి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రచారం కోసం కాకుండా, నిపుణుల సలహాలు, సాగునీటి శాఖ ఇంజినీర్ల సాంకేతిక సూచనల మేరకు ప్రతి నిర్ణయం తీసుకుంటోందన్నారు.

భారాస నాయకులు ముందు వీటికి సమాధానం చెప్పండి

మేడిగడ్డ బ్యారేజీ నేడు ఈ పరిస్థితికి రావడానికి బాధ్యులు ఎవరు?

నిర్మాణ నాణ్యతపై వచ్చిన ప్రశ్నలకు భారాస సమాధానం ఎందుకు చెప్పడం లేదు?

ప్రాజెక్టుల భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమా?

గోదావరి వరదలను కూడా రాజకీయ ప్రచారానికి వాడుకోవడం రైతుల పట్ల బాధ్యతేనా?

పదేళ్ల పాలనలో పూర్తి చేయని హామీల గురించి ప్రజలకు ఎప్పుడు వివరణ ఇస్తారు?

### రైతులను రెచ్చగొట్టడం కాదు... నిజాలు చెప్పండి

తెలంగాణ రైతు అమాయకుడు కాదు. ఏది వాస్తవం... ఏది రాజకీయ ప్రచారం అన్నది రైతు బాగా అర్థం చేసుకుంటాడు.

ప్రజలకు కావాల్సింది ప్రెస్‌మీట్లు కాదు... సాగునీరు.


రైతులకు కావాల్సింది విమర్శలు కాదు... సమయానికి నీటి పంపిణీ.

తెలంగాణకు కావాల్సింది అబద్ధాల ప్రచారం కాదు... బాధ్యతాయుతమైన రాజకీయాలు.

మేడిగడ్డను దెబ్బతీసిన వారు... నేడు మేడిగడ్డపై నీతులు చెప్పడం చరిత్రను మరిచిపోవడమే.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా, శాస్త్రీయంగా సాగునీటి నిర్వహణ కొనసాగిస్తుందని మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

# ప్రజా ప్రతిపక్షం లేని ... అణచివేతే అభివృద్ధా?




మన దేశంలో ప్రజాస్వామ్యం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో గెలిచిన పార్టీ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం సహజమే, కానీ ప్రతిపక్షాన్ని నిర్మూలించడం, ప్రశ్నించే స్వరాలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. పశ్చిమ బెంగాల్ నుండి తెలుగు రాష్ట్రాల వరకు ఈ ధోరణి తీవ్రంగా కనిపిస్తోంది. అధికారం మారినప్పుడల్లా జెండాలు మారుతున్నాయే తప్ప ప్రజల సమస్యలు మారడం లేదు. కావునా ఈ దేశానికి నేడు అత్యవసరమైనది బలమైన, నిజమైన ప్రజా ప్రతిపక్షం.

ప్రజాస్వామ్యంలో ఓటు పౌరుని అత్యున్నత అధికారం. కానీ ఆ అధికారం ఇప్పుడు కొనుగోలు వస్తువుగా మారింది. అధికార పక్షాన్ని నిలదీసే వర్గాలను లక్ష్యంగా చేసుకుని వారి ఓటును 'సర్' (SIR) పేరుతో జాబితా నుండి తొలగిస్తున్నారు. బీహార్‌లో 2025లో జరిగిన SIR ప్రక్రియలో దాదాపు 47 లక్షల మంది ఓటర్ల పేర్లు తొల గించబడ్డాయి, ముస్లిం మెజారిటీ ఉన్న సీమాంచల్ ప్రాంతంలో ఈ తొలగింపుల శాతం రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉండటంతో బీజేపీకి ఓటు వేయని వర్గాలనే లక్ష్యంగా చేసుకున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో దాదాపు లక్షా పదిహేను వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అంచనా వేసింది, ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నిక ఇది. ఈ ధనం కార్పొరేట్ సంస్థల నుండి, భూస్వాముల నుండి, ఖనిజ వనరుల లాభదారుల నుండి వస్తుంది, ఆ తర్వాత అదే వర్గాల పక్షాన విధానాలుగా రూపొందుతుంది. ఇది యాదృచ్ఛికం కాదు, ఒక వ్యవస్థీకృత చక్రం. ప్రజలను నిరుపేదలుగా ఉంచి డబ్బు, మద్యం, కులపు లెక్కలతో ఓట్లు కొనుగోలు చేసి, తర్వాత అదే పాలకులు "ప్రజలే డబ్బులకు అమ్ముడుపోతున్నారు" అని నిందించడం కపటత్వంలో పరాకాష్ట. ఆర్థిక స్వాతంత్ర్యం లేని పౌరుడు రాజకీయంగా స్వతంత్రుడు కాలేడు, కావున ధన రాజకీయాలను ఎదుర్కోవడం సామాజిక న్యాయపు ప్రశ్న కూడా.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ దాదాపు పదిహేనేళ్ళు పాలించి, ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థల ఒత్తిళ్ళు, రాజకీయ హింస ద్వారా ప్రతిపక్షాన్ని బలహీనపరిచింది. కానీ 2022లో ఉపాధ్యాయ నియామక అవినీతి, 2024లో ఆర్.జి.కర్ వైద్య కళాశాలలో డాక్టర్ హత్య దేశవ్యాప్త నిరసనలకు దారితీశాయి, బయటి ప్రతిపక్షాన్ని మింగిన పార్టీ లోపలి కుళ్ళుతో విలవిల్లాడింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే చిత్రం బహిరంగంగా కనిపిస్తుంది: ఏపీలో 2019లో వైసీపీ, 2024లో టీడీపీ అధికారంలోకి రాగానే ప్రత్యర్థి నేతలపై వందలాది కేసులు నమోదవుతున్నాయి; తెలంగాణలోనూ ప్రతి అధికార మార్పిడి తర్వాత నిన్నటి పాలకులు నేటి నిందితులవుతున్నారు. ఏళ్ళ కేడర్‌ను పక్కనపెట్టి అవకాశవాద వలస నేతలకు టికెట్లు ఇవ్వడం పార్టీల పునాదులనే బలహీనపరుస్తోంది. ఈ రాజకీయ పగతీర్చుకోవడాల మధ్య నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రాథమిక సేవలు, కుల అసమానతలు అనే అసలు సమస్యలు చర్చకు రావడం లేదు.

మన దేశంలో "హింస" అంటే తుపాకీ, కత్తి మాత్రమే అనే నిర్వచనం స్థిరపడింది గానీ ఇది అసంపూర్ణం. NCRB లెక్కల ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా 11 వేలకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు స్వీయ మరణాలు చేసుకున్నారు; ఐఐటి, ఎనఐటి, సెంట్రల్ యూనివర్శిటీల విద్యార్థుల స్వీయ మరణాలు ప్రతి ఏటా వందల్లో నమోదవుతున్నాయి. కుల వివక్ష, మహిళలపై దాడులు, వరకట్న హత్యలు, కార్మిక దోపిడీతో జరిగే మరణాలు కూడా ఈ విస్తృత నిర్వచన పరిధిలోకి వస్తాయి, ఇవి వ్యవస్థాగత నిర్లక్ష్యం, అసమానత ఫలితాలే తప్ప వ్యక్తిగత దురదృష్టాలు కావు. డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్టు, "రాజకీయ ప్రజాస్వామ్యం అర్థవంతం కావాలంటే సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం కూడా ఉండాలి." ఓటు హక్కు ఉన్నా చదువుకోవడానికి డబ్బు లేక, జబ్బుపడినప్పుడు వైద్యం అందక, కులం వల్ల అవమానాలు పడుతూ జీవించే ప్రజలకు ఆ ప్రజాస్వామ్యం ఎంత వాస్తవం?


రాష్ట్ర హింస, బూటకపు ఎదురుకాల్పులు, పోలీసు నిర్బంధంలో మరణాలు కూడా చర్చకు రావాల్సినవే; జాతీయ మానవ హక్కుల కమిషన్ లెక్కల ప్రకారం ఈ మరణాల సంఖ్య తగ్గడం లేదు. పోలీసు వ్యవస్థ ప్రజలకు సేవ చేయాలి తప్ప ఏ పార్టీకో కాదు, కానీ అధికారం మారిన ప్రతిసారీ ఉన్నతాధికారులపై బదిలీలు, సర్వీసు నిలిపివేతలు పెరుగుతున్నాయి. ప్రకాష్ సింగ్ దాఖలు చేసిన అర్జీపై అత్యున్నత న్యాయస్థానం పోలీసు సంస్కరణలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, దశాబ్దాలు గడిచినా చాలా రాష్ట్రాలు వాటిని అమలు చేయలేదు, రాజకీయ అధికారం పోలీసు వ్యవస్థను వదలదు కనుక.

ప్రజా ప్రతిపక్షం అంటే కేవలం ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ కాదు, అది విస్తృతమైన భావన. ఒక స్తంభాన్ని అణచివేసినా అది మరో రూపంలో మళ్ళీ పుడుతుంది. ప్రశ్నించే మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం, కానీ దాన్నే మొదట లక్ష్యంగా చేసుకుంటున్నారు. భారత్ 2026 RSF మీడియా స్వేచ్ఛ సూచికలో 180 దేశాల్లో 157వ స్థానానికి పడిపోయింది, గత ఏడాది 151వ స్థానం నుండి దిగజారింది. ప్రశ్నించే జర్నలిస్టులపై యుఏపిఏ, రాజద్రోహం కేసులు పెరుగుతున్నాయి. ఈ కుట్రపూరిత నిర్బంధం ఒక గొంతును మూయగలిగినా, ప్రజాస్వామ్య చైతన్యం వేరే రూపాల్లో ప్రతిఘటనగా మారుతూనే ఉంది. రోహిత్ వేముల మరణం విద్యార్థి ప్రజాస్వామ్య స్పృహను కదిలిస్తే, 2020-21లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతు ఉద్యమం మూడు వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా చేసింది. అదే పరంపరలో, రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులు ఆచరణలో అమలవుతున్నాయా అని నిరంతరం ప్రశ్నించే దళిత బహుజన, మహిళా సంఘాలు ప్రజాస్వామ్యపు నిజమైన కాపలాదారులుగా నిలుస్తున్నాయి. వామపక్ష, విప్లవ ఉద్యమాలు కూడా ఇదే పరంపరలో భూ పంపిణీ, శ్రామిక దోపిడీ, దళిత బహుజన ఆదివాసీ హక్కులు, కుల అణచివేత అంశాలను ముందుకు తెచ్చిన చారిత్రక పాత్రను విస్మరించలేం. వారి పద్ధతులపై భిన్నాభిప్రాయాలుండొచ్చు గానీ అసమానతలను ప్రశ్నించే గొంతుకల అవసరాన్ని నిరాకరించలేం. పార్లమెంటరీ ప్రతిపక్షం బలహీనపడినా, ప్రభుత్వేతర ప్రజా శక్తులు, అంటే మీడియా, ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంస్థలు, బలంగా ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం పూర్తి నిరంకుశత్వంగా మారదు. అసలు ప్రశ్న ఉద్యమం ఏ భావజాలానికి చెందిందన్నది కాదు, అది అసమానతలను ప్రశ్నిస్తుందా, హక్కులను విస్తరిస్తుందా, జవాబుదారీతనాన్ని బలోపేతం చేస్తుందా అన్నదే. ప్రశ్నించే స్వరాలు లేకపోతే బలమైన ప్రభుత్వం కూడా క్రమంగా నిరంకుశత్వం వైపు జారిపోవచ్చు.

ఈ ప్రశ్నించే స్వరాల అవసరం కేవలం రాజకీయ వ్యూహం కాదు, సమాజపు తాత్విక పునాదికి సంబంధించిన ప్రశ్న. పొట్టకూటి కోసం రోజుకు 12-14 గంటలు వ్యవసాయంలో, గిగ్ వర్కర్లుగా, చేనేతలో, కల్లుగీతలో, మాల మాదిగ తదితర శ్రామిక వృత్తుల్లో రెక్కలు ముక్కలు చేసుకునే బహుజన శ్రామికుడికి బ్రతకడమే ఒక పోరాటంగా మారినప్పుడు అతనికి "స్వేచ్ఛ" ఎక్కడుంది? సమాజంలో ఒక్కరు బానిసత్వ పరిస్థితుల్లో జీవిస్తున్నా ఆ సమాజం పూర్తి స్వేచ్ఛను సాధించినట్టు కాదు, అత్యంత అణగారిన వ్యక్తి స్వేచ్ఛ, గౌరవం, అభివృద్ధి స్థాయే ఆ సమాజ ప్రజాస్వామిక ప్రగతికి నిజమైన కొలమానం. కావున సామాజిక సమతుల్యత అంటే కేవలం రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల ప్రశ్న కాదు, నిర్ణయాత్మక స్థానాల్లో భాగస్వామ్యం, నాణ్యమైన విద్య ఆరోగ్య సేవలు, కులం మతం లింగం ఆధారంగా వివక్ష లేని సమగ్ర వ్యవస్థను నిర్మించే నిరంతర ప్రజాస్వామిక ప్రక్రియ అది.

పాలకుల పట్ల దేవుడిల ఆరాధన కాదు, జవాబుదారీగా నిలబెట్టే పౌర స్పృహ అవసరం, ఓటు హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా, పోలీసు వంటివి నిజంగా స్వతంత్రంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుంది. ఏ పార్టీ అయినా ప్రతిపక్షాన్ని నిర్మూలించే బదులు ప్రజా సమస్యలపై పోటీ చేయాలి, విధానాల పోటీయే నిజమైన ప్రజాస్వామ్యం. చరిత్ర ఒక సత్యాన్ని మళ్ళీ మళ్ళీ నిరూపిస్తోంది: ప్రశ్నించే స్వరాలను అణచివేసే వ్యవస్థలు తాత్కాలికంగా బలంగా కనిపించినా దీర్ఘకాలంలో లోపల నుండే కూలిపోతాయి, 1975 అత్యవసర పరిస్థితి ఇందిరా గాంధీని అధికారం కోల్పోయేలా చేయడం దీనికి ఉదాహరణ.

ప్రజాస్వామ్యం ఐదేళ్ళకొకసారి జరిగే ఎన్నికలు మాత్రమే కాదు, అది ప్రతిరోజూ జీవించే విలువ, జర్నలిస్టు ప్రశ్నలో, విద్యార్థి నిరసనలో, రైతు పోరాటంలో, దళిత బీసీ కార్యకర్త గొంతులో అది శ్వాసిస్తుంది. పౌర సంస్థలు, రాజ్యాంగ సంస్థలు, వివిధ రాజకీయ పక్షాలు స్వతంత్రంగా, బలంగా పనిచేసినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం బలంగా పనిచేస్తుంది. ప్రజల గౌరవాన్ని, స్వేచ్ఛను, సమానత్వాన్ని కాపాడే ఈ శక్తులే నిజమైన ప్రజా ప్రతిపక్షం. అవి బలంగా నిలబడినప్పుడే సమాజంలో సమతుల్యత సాధ్యమవుతుంది, అదే ప్రగతికి నిజమైన బాట.



పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ)

## బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం సమావేశం

- **భారత్ అధ్యక్షతన హైదరాబాద్‌లో బ్రిక్స్ సదస్సు**
- **హైదరాబాద్ వేదికగా అవినీతి నిరోధక కార్యాచరణ బృందం భేటీ**
- **డీవోపీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సమావేశాలు**
- **రెండు రోజుల పాటు జరగనున్న ప్రతి ప్రతినిధుల సదస్సు**
- **స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం ఇతివృత్తం**
- **సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ప్రారంభం**
- **సీమాంతర అవినీతి, ఆస్తుల రికవరీపై దృష్టి**
- **మొదటి సమావేశం ఫలితాల ఆధారంగా చర్చలు**

**హైదరాబాద్ పిఐబి వెలుతురు ఆగస్టు 03:**

**అంతర్జాతీయ వేదికపై భారత్ తన ప్రాబల్యాన్ని మరోసారి చాటుకుంటోంది. బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారత్ సారథ్యంలో, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం రెండో సమావేశం అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిబ్బంది, శిక్షణ విభాగం ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి ఆతిథ్యమిస్తోంది.ఈ అంతర్జాతీయ కార్యక్రమం ఆగస్టు 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్ వేదికగా జరగనుంది. ఈ భేటీతో పాటుగా ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాన్ని కూడా అత్యున్నత స్థాయిలో నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాల మధ్య అవినీతిని అంతమొందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం.భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్-2026 ఇతివృత్తమైన 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఆదర్శవంతమైన స్ఫూర్తితో ఈ సమావేశాన్ని రూపుదిద్దారు. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా ఈ సమావేశాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. బ్రిక్స్ సభ్యదేశాల నుంచి విచ్చేసే ప్రతినిధులతో పాటు సీనియర్ విధాన రూపకర్తలు, నిపుణులు, ప్రాక్టీషనర్లు, అవినీతి నిరోధక మరియు లా ఎన్ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు.గతంలో జూన్ 2, 3 తేదీల్లో వర్చువల్‌గా జరిగిన బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం మొదటి సమావేశం నిర్ణయాల ఆధారంగా ఈ హైదరాబాద్ భేటీ ముందుకు సాగుతోంది. ఆస్తుల రికవరీని వేగవంతం చేయడం, సీమాంతర అవినీతిని గట్టిగా ఎదుర్కోవడం, పాలనలో పారదర్శకతను మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంచడంపై బ్రిక్స్ సభ్యదేశాలు చర్చించనున్నాయి. అవినీతికి పాల్పడి ఇతర దేశాలకు పారిపోయిన నేరస్తుల ఆచూకీని త్వరగా గుర్తించడానికీ, వారిని సొంత దేశాలకు రప్పించే అప్పగింత ప్రక్రియలకు మద్దతు ఇవ్వడానికీ సభ్యదేశాల మధ్య అనధికారిక సహకారాన్ని బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ ద్వారా కీలక సమాచారాన్ని పంచుకోవడంపై ఒక స్పష్టమైన అవగాహనకు రానున్నారు.నేటి డిజిటల్ యుగంలో ఫిన్‌టెక్, డిజిటల్ ఆస్తులు మరియు కొత్తగా వస్తున్న డిజిటల్ ఆర్థిక సాధనాల వల్ల ఉత్పన్నమయ్యే అవినీతి ప్రమాదాలను అడ్డుకోవడం అత్యంత కీలకమైన అంశంగా మారింది. ఈ డిజిటల్ నేరాలను అరికట్టడంలో సభ్యదేశాలు సాధించిన అనుభవాలను, ఉత్తమ విధానాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఉమ్మడి వ్యూహాలను ఖరారు చేయనున్నారు.సమావేశంలో భాగంగా ఆగస్టు 5న "ఆవిష్కరణ, సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అనే కీలక అంశంపై ఒక ప్రత్యేక అనుబంధ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. డిజిటల్ ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థ, పౌరుల భాగస్వామ్యం, సమాచార పారదర్శకత, ప్రభుత్వ పరిపాలనలో నిజాయతీని పెంపొందించేందుకు సాంకేతికతను ఏ విధంగా ఉపయోగించాలో ఈ వేదికపై సమగ్రంగా చర్చిస్తారు.హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సమావేశం బ్రిక్స్ దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడంలో భారత్ చూపుతున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. నేరాల రహిత సమాజ నిర్మాణం, సీమాంతర అవినీతి నిరోధం మరియు సంస్థాగత సామర్థ్యాల నిర్మాణంలో ఈ భాగ్యనగర భేటీ ఒక నూతన అధ్యాయానికి పునాది వేస్తుందని ప్రపంచ నిపుణులు భావిస్తున్నారు.**

# నాగన్ పల్లి రోడ్డు నుండి బెటా లియన్ కు అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే

- **పోలీసుల కష్టానికి తగిన గుర్తింపు నిచ్చేలా ప్రభుత్వం కృషి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 03:**






ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి నుండి బెటాలియన్ కు అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవం చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ఒత్తిడి సవాళ్ల మధ్య సేవలందించే పోలీసుల జీవితంలో క్రీడలు శారీరక దృఢత్వం తోపాటు మానసిక ప్రశాంతతను నింపుతాయని ప్రజలరక్షణ కోసం ప్రతిక్షణం అప్రమత్తంగా ఉం డే పోలీసులకు క్రీడలు కేవలం వినోదమే కాకుండా విధి నిర్వహణకు మరింత శక్తినిచ్చే ప్రేరణగా చెప్పారు ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభా నగర్‌లోగల తెలంగాణ స్పెషల్ పోలీస్ మూడో బె టాలియన్ ఇంటర్నల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు ముందుగా బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన ఎమ్మెల్యే కాగడా వెలిగించి క్రీడాపోటీలను ప్రారంభించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిమూ డో బెటాలియన్‌లో పనిచేస్తున్న సిబ్బంది అంతా ఇబ్రహీంపట్నం కుటుంబసభ్యులుగాపేర్కొన్నా రువారికి ఎలాంటి కష్టమొచ్చినాతాను అండగా ఉంటానన్నారు ఇక్కడ పనిచేస్తున్న వారి సమ స్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానన్న ఎమ్మెల్యే హెచ్ఆర్ఏ అంశంపై ఇప్ప టికే కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు ప్రాణాలకు తెగించి ప్రజలకు భరోసాగా నిలిచే పోలీసుల కు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు క్రీడాస్ఫూర్తితో గెలుపోట ములను సమానంగా స్వీ కరి స్తూమున్ముందు మరిన్ని ఈతరహా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు అ ప్రోచ్‌రోడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి హెచ్ఎండీఏ నిధులతో నాగన్‌పల్లి రోడ్ నుంచి బె టాలి యన్ గేటు వరకు నిర్మించిన అప్రోచ్ రోడ్డును ఈసందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు ఇక్కడ అతిథి గృహంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్న ఆయన కావాల్సిన సౌకర్యాలు తన దృష్టికి తెస్తే ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్తానని చె ప్పారు రెండున్నరేళ్లలో 700కోట్లు రోడ్ల కోసమే తెచ్చానని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి 102 ఫిర్యాదులు

- **ప్రజల సమస్యలను సత్వరమే అధికారులు వెంటనే పరిష్కరించాలి**
- **జిల్లా కలెక్టర్ సి . నారాయణ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 03:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలోసోమవారం సమీ కృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం102ఫిర్యాదులు అందాయి ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయ ణరెడ్డి దృష్టికి తీసు కు వచ్చి వినతిపత్రాలు సమర్పించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలనుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరిం చాలని ఆదేశించారుఅర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎ ప్పటికప్పుడుసమీక్ష నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతం గావ్యవహరించాలని తెలిపారుఈ ప్రజావాణి కార్యక్రమంలోరెవెన్యూశాఖకు చెందిన 33 ఇతర శాఖలకు చెందిన 69 మొత్తం102 దరఖాస్తులు అందాయిఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి కిరణ్మయి జిల్లా రె వెన్యూ అధికారి శారద వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సంబంధి త అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి దేయ్యం-ప్రజా సేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 03:**





కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్, మహాదేవపురం డివిజన్‌లోని బతుకమ్మ బండ ప్రాంతంలో రూ.80 లక్షల వ్యయంతో, అలాగే కైసర్ నగర్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో మంజూరైన మొత్తం 2 కోట్ల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఈరోజు కుత్బుల్లాపూర్ మొట్టమొదటి ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక బస్తీ వాసులు రోడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యే హ్యాట్రిక్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో యాక్టింగ్ చేయడం తప్ప అభివృద్ధిపై దృష్టి సాధించకుండా ఎంతసేపు ప్రభుత్వం వద్ద నిధులు లేవంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారని మండిప డ్డారు, ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజల అవ సరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీధర్ బాబు కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఉచిత విద్యుత్తు,ఉచిత బస్సు, సన్న బియ్యం,వంటి పథకాలను ప్రభుత్వం అమలు పరుస్తుందని తెలిపారు, రామన్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి దోహతపడాలని స్థానికులను ఉద్దేశించి ప్రసంగిం చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, తోసిఫ్, పూలమ్మ, ప్రసాద్,నరేందర్ రెడ్డి, జమీల్ పాషా, పరమేశ్వర్ పంతులు, సంగయ్య, మహేష్ రెడ్డి, రాములు,జబ్బర్,రసూల్, ముక్తార్ భవానీ పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో షేర్‌మనీ స్వీకార వేడుక ఘనంగా నిర్వహణ

**ఆల్మాస్‌గూడ, వెలుతురు ఆగస్టు 3:**




రంగారెడ్డి జిల్లా ఆల్మాస్‌గూడ, తిరుమల నగర్, శ్రీ శ్రీ హోమ్స్ రోడ్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సోమవారం షేర్‌మనీ స్వీకార వేడుక ఘనంగా నిర్వహించారు.ఆగస్టు 3, 2026న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి ప్రతినిధులకు నాయకత్వ బ్యాడ్జీలను అలంకరించి, పాఠశాల బాధ్యతలను అధికా రికంగా అప్పగించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బి. శ్రీనివాస్ రెడ్డి, డా. పి. రఘువీర చారి, డా. టి. సుధాకర్ రెడ్డి, ఎ. సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆదర్శ నాయకులుగా ఎదిగి పాఠశాలకు, సమాజానికి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ రాణి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన వైఖరి, క్రమశిక్షణ, సేవా భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎంపికైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 03 (వెలుతురు) :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం డి.పోచంపల్లికి నివాసులు బొంగునూరి విష్ణువర్ధన్ రెడ్డి నిర్వహించిన నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం లో తాజా మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నోట్‌బుక్‌ల పంపిణీ ద్వారా విద్యార్థులకు అండగా నిలిచేందుకు బొంగునూరు విష్ణువర్ధన్ రెడ్డి చేపట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని అభినం దించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో చదువును కొనసాగించేలా ప్రోత్స హించడంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు విద్యే పునాది అని తెలిపారు. విద్యార్థులు అంకితభావంతో చదువు కోవాలని, తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కోల సాయి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ దుండిగల్ సర్కిల్ జనరల్ సెక్రెటరీ కోల్తూర్ మల్లేష్ ముదిరాజ్, ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి క్రిష్ణ, నాయకులు బిక్షపతి గౌడ్, ఈ శ్రీనివాస్, దార మహేష్, పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# దుండిగల్ గ్రామంలో రూ.70 లక్షల CMC నిధులతో UGD పనులకు శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్ వెలుతురు ఆగస్టు 03:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గ్రామం, 296వ డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా, ఆయన ప్రత్యేక చొరవతో CMC నిధుల నుంచి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో దుండిగల్ గ్రామంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (UGD) అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు దుండిగల్ గ్రామం, 296వ డివిజన్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, కావలి శశి కుమార్, ఆకుల మధు, చిన్న ముత్యం రెడ్డి, బిక్షపతి రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో మిషన్ భగీరథ ఏఈ అనూష మృతి

- **సంతాపం ప్రకటించిన ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 03:**



ఇబ్రహీంపట్నం మిషన్ భగీరథ ఎఇ అనూష ( 33 )హఠాన్మరణం చెందారు వనస్థలిపురం లోని వారి నివాసంలో తీవ్రమైన గుండెపోటుతో కుప్పకూలిన అనూష ను కుటుంబసభ్యులు ఆసుప త్రికి తరలించారురెండు రోజులపాటు నగరంలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు మిషన్ భగీరథ ప్రాజెక్టులోఇబ్రహీంప ట్నంసహాయక ఇంజనీర్గా బాధ్యతలు నిర్వహి స్తున్న ఆమె అబ్దుల్లాపూర్ మెట్ అదనపు బాధ్య తలు కూడా నిర్వహిస్తున్నారు అనూష కు భర్త ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు చిన్న వయసులోనే మంచి అధి కారినిగా గుర్తింపు పొందిన అనూష ఆకస్మిక మృతిపట్ల.మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు మిషన్ భగీరథ కార్యక్రమం ప్రారంభం నుండి ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఆమె చా లా కష్టపడి ప నిచేశా రని వారు గుర్తు చేశా రు ఎఇ అనూష ఆకస్మి క మరణంతో ఇబ్రహీం పట్నంలో విషాద ఛా య లు అలముకున్నాయి మిషన్ భగీరథ ఇబ్ర హీంపట్నం ఏఈ అనూష మృతి పట్ల పలువురు అధికారులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

# ఆరుట్లలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు అవగాహన కార్యక్రమం

- **వస్త్రాలపై మరకల తొలగింపు పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించిన విద్యార్థులు**

**మంచాల వెలుతురు ఆగస్టు 03:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవ సాయ విశ్వవిద్యాలయం వి ద్యార్థులు గత కొన్ని రోజులుగా ప్రజలకు వివి ధ పనుల గురించి అవగాహన కల్పిస్తున్నారుప్రొఫె సర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశల దుస్తులు మరియు వస్త్రాలు విభాగానికి చెందిన విద్యార్థులు గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్ర మంలో భాగంగా గ్రామస్థులకు మరకల తొలగింపు పద్ధతులు అనే అంశంపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వ హించారు ఈకార్యక్రమంలో నూనె పసుపు కూర టీ బురద చాక్లెట్ వంటి సాధార ణంగా దుస్తులపై పడే మరకలను ఇంట్లోనే సులభంగా లభించే డిటర్జెంట్ నిమ్మరసం వెనిగర్ టాల్కంపౌడర్ మొక్క జొన్న పిండి వంటి పదార్థాలతో ఎలా తొలగించాలో ప్రత్యక్షంగా ప్రదర్శించారు అలాగే మర క పడిన వెంటనే శుభ్రం చేయడం వస్త్రం రకానికి అనుగుణంగా మరక తొల గించే పద్ధతిని ఎంచుకోవడం వస్త్రసంరక్షణ సూచనలను పాటిం చడం వల్ల దుస్తుల నాణ్యత మన్నిక పెరుగుతాయని వివరిం చారు. గ్రామ స్థులు ఈకార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొని మరకల తొల గింపుకు సం బంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు ఈఅవగాహన కార్యక్ర మంద్వారా దుస్తుల సంరక్షణ పరిశుభ్రత గృహ వనరుల పొదుపు ,వస్త్రాల జీవితకా లాన్నిపెంచే పద్ధతులపై గ్రామస్థుల్లో అవగాహన పెంపొందింది ప్రజలు శుభ్రత పరిశుభ్రత పాటిం చి పరిశుభ్రంగా ఉండాలి నేను చెప్పే విధంగా పాటించాలి అని విద్యార్థులు ప్రజలకు వివరించారు.

# తాండల్లో జోనల్ కమిషనర్ పర్యటన

**కుత్బుల్లాపూర్ (వెలుతురు) ఆగస్టు 03:**



దుండిగల్ తండాల్లో కుత్బుల్లాపూర్ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ పర్యటించారు. తండాలోని రోడ్లు లింక్ రోడ్డు పరిశీలించారు. పగిలిన రోడ్లు గుంతల పడ్డ వాటిని వెంటనే మంజూరు చేస్తామన్నారు. దుందిగల్ సర్కిల్ డిసితో కలిసి బస్తీ రోడ్లు పరిశీలించిన జోనల్ కమిషనర్ వెంటనే ఎస్టిమేట్ వేసి రోడ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తాండలలోని ప్రధాన సమస్యలను జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రేవ్ యార్డ్ లో రోడ్డు, వాటర్ బోర్, వెయిటింగ్ హాల్, స్నానల గదులు లాంటి సౌకర్యాలు కల్పించాలని, డ్రైనేజీ నీరు అవుట్ లెట్ శాశ్వత పరిష్కారం చూపించాలని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే హెచ్ఎంటి మీదుగా తాండ1 సర్వీస్ రోడ్ వరకు లింక్ రోడ్డు సాంక్షన్ చేయాలని తండాలో డ్రైనేజీ పూర్తి అయి సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్తి రోడ్లు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ కి కోరారు.అందుకు స్పందించిన కమిషనర్ సమస్యలు ఉన్న రోడ్లను సమస్యాత్మక పనులను వెంటనే సాంక్షన్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజలు నాయకులు అధికారులు హెచ్ఎంటి అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**గుండాల, ఆగస్టు 3 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతు న్నాయని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణం కోసం సర్వే నంబర్ 906లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు వెల్లడించారు. ప్రస్తుత సాగు సీజన్‌కు అవస రమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని చెప్పారు.ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు మంజూరు చేస్తున్నామని, రెండో విడత అమలు కూడా ప్రారంభమైందని తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పెన్షన్లు అంద జేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్



అండం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరసరపు యాదగిరి గౌడ్, గుండాల గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, లింగాల భిక్షంగౌడ్, ఏలూరు రామిరెడ్డి, ఇమ్మడి దశరథ, డైరెక్టర్లు దుదిగాని నాగరాజు, సంగీ శ్రీను, చేగురి రాధ, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంధ మల్ల బాలయ్య మృతి చాలా బాధాకరం

- ఎస్.కె చాంద్ఉ ద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీసీ అధ్యక్షులు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 03:**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి జిల్లా అధ్యక్షులు గంధ మల్ల బాలయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె చాంద్ బాలయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమకారులు ఒక్కొక్కరు నేలకు వరుగుతుంటే ప్రభుత్వాలు మాత్రం ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం చేయడం లేదు. తొలి దశ మలిదశ ఉద్యమంలో గంధ మల్ల బాలయ్య తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన గొప్ప తెలంగాణ నాయకులు ఉద్యమకారులకు తెలంగాణ వచ్చినంక కూడా అన్యాయం జరుగుతుంటే డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గంధ మల్ల బాలయ్య జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ ఉద్యమకారులకు న్యాయం



చేయాలని గత మూడు సంవత్సరాల నుంచి ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ ఉన్నారు. నిన్న రాత్రి గుండెపోటుతో వారు అకాల మృతి చెందడం ఉద్యమకారులకు తీరం లోటు అని వారి కుటుంబానికి ఉద్యమ కారుల ఫోరం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి రామన్నపేట మండల అధ్యక్షులు నోముల శంకర్ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, గంధ మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# గుండాల పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ

- సిబ్బంది కొరత, మందుల లభ్యతపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సీరియస్
- డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి వెంటనే సమగ్ర నివేదిక కోరిన ఎమ్మెల్యే

**గుండాల ఆగస్టు 03 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యత, అత్యవసర వైద్య సేవలు, ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించిన ఆయన, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి గడువు, అవసరమైన మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అనే అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో



వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై వివరాలు సేకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 108 అంబులెన్స్ సేవల పనితీరును సమీక్షించిన బీర్ల అయిలయ్య, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయం, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై ఆరా తీశారు. అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, ఆసుపత్రిలో సిబ్బంది కొరత, మందుల లభ్యత, గడువు ముగిసే మందుల పరిస్థితి, 108 సేవలపై సమగ్ర



నివేదికను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్యం అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# నోముల నారాయణ మృతి చాలా బాధాకరం

- కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్నంల

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 03:**

నీర్నేముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల నారాయణ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నారాయణ మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహ సీనియర్ నాయకులు ఆవుల సత్యనారాయణ మండల



నాయకులు చల్ల సత్య ప్రకాష్ యువజన విభాగం నాయకులు మాజీ వార్డ్ మెంబర్ నోముల ప్రవీణ్, నోముల విష్ణు, సుర్వి శివకృష్ణ, వర్పు. తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**గుండాల ఆగస్టు 3.(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గంగాపురం గ్రామంలో సోమవారం రోజున అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాళి మంజుల ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవజాత శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైన ఆహారమని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, శిశు ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ ఫరీదా, అంగన్వాడి టీచర్ టి. యాదలక్ష్మి,





తల్లులు వెన్నెల స్వప్న, కావ్య, కాళి స్వప్న, దయ్యాల కావ్య, ఖతిజ, అపర్ణ చిన్నారులు పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తులను నమ్మవద్దు

- లైసెన్స్‌లు, శిక్షణ (Training) కోసం నేరుగా శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలి
- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 03:**

ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార భద్రత తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్న సందర్భంలో, కొందరు వ్యక్తులు జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగానికి చెందిన అధికారులమని చెప్పుకుంటూ వ్యాపారులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి వచ్చినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీ మనోజ్ కుమార్ తెలిపారు.కొంతమంది వ్యక్తులు "ట్రైనింగ్ సర్టిఫికెట్లు ఇప్పిస్తాం", "లైసెన్స్‌లు ఇప్పిస్తాం" అంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, వారికి ఎలాంటి నగదు చెల్లించవద్దని వ్యాపారులకు సూచించారు.ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు లేదా ఇతర అధికారిక సేవలకు సంబంధించి అవసరమైన సమాచారం కోసం నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని తెలిపారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనల గురించి వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీ మనోజ్ కుమార్ కోరారు.

# అఖిల భారత యువజన సమాఖ్య మండల కమిటీ ఎన్నిక

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 03:**





అఖిలభారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్ ) చౌటుప్పల్ మండల కమిటీ అధ్యక్షుడిగా గుండెబోయిన భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా బరిగెల వేణు ఎన్నికైనట్లు ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా బద్దుల సాయితేజ, సహాయ కార్యదర్శిగా ఉడుత రాజు కోశాధికారి గా నీళ్ల రామును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శి మాట్లాడుతు చౌటుప్పల్ మండలంలో ఏ ఐ వై ఎఫ్ బలోపేతం కోసం కృషి చేస్తామని, యువత సమస్యలపై పోరాటాలు చేసి యువజన హక్కుల సాధన కోసం కృషి చేస్తామని అన్నారు.

# కొండగడప అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు .

**మోత్కూర్, ఆగష్టు 03,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో అంగన్వాడి కేంద్రం రెండో సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు జరిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొండ శోభ సోంమల్లు మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు శ్రీ రామ రక్ష అని, తల్లిపాలు పిల్లలకు గంటలోపు పట్టించాలని, వాటిలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఎలాంటి వ్యాదులు రాకుండా కాపాడుతాయని రు.అనంతరం అంగన్వాడీ స్కూల్ పిల్లలకు యూనిఫామ్ లు అందజేశారు.కార్యక్రమానికి MLHP ఉమారాణి, ఆశా వర్కర్ బి ఎల్లమ్మ, AWC అలివేలుమంగ, AWH CH. మంగమ్మ,గర్భిణీ స్త్రీలు,బలింత తల్లులు,



పిల్లలు హాజరయ్యారు.

# సెంట్రింగ్ యూనియన్ నూతన మండల కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా ఎన్నికైన జంగ సతీష్**

**మోత్కూర్, ఆగష్టు 03,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో సోమవారం శ్రీ రామలింగేశ్వర సెంట్రింగ్ యూనియన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో గౌరవ అధ్యక్షుడుగా మెంట నర్సింహా, గౌరవ సలహాదారులుగా రాంపాక పాపయ్య, గడ్డం లక్ష్మయ్య, అధ్యక్షుడుగా జంగ సతీష్, ఉపాధ్యక్షుడుగా కూరెళ్ల నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం స్వామి, సహాయ కార్యదర్శిగా సారగాండ్ల మత్స్య గిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆరే మత్స్య గిరి, ప్రచార కార్యదర్శిగా కళ్లెం కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సి హెచ్.బాపు, కార్యవర్గాన్ని యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.



# గుండాలలో పోలీసుల రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్ – యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్

**గుండాల ఆగస్టు 03 (వెలుతురు):**

రోడ్డు ప్రమాదాల్లో ప్రతి రోజు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గుండాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులను నేరుగా కలిసి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాల్సిందేనని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్



సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమే కాకుండా వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడమేనని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి వాహనదారుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలను వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. "ఒక్క క్షణం నిర్లక్ష్యం... జీవితాంతం విషాదం" అనే సందేశంతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో గుండాల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐలు ప్రకాశ్, వేణుగోపాల్, పోలీసు సిబ్బంది జహంగీర్, శంకర్ పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే "జైల్ భరో" కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గొరిగే సోములు

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 03:**

గ్రామం కక్కిరేణి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గొరిగే సోములు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కక్కిరేణి గ్రామంలో కార్మికులతో కలిసి జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గొరిగే సోములు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక మలుపు తిప్పిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రజలకు పోరాట స్ఫూర్తిని, ఐక్యతను అందించిందన్నారు. అదే స్ఫూర్తితో నేడు ప్రజల



హక్కుల పరిరక్షణ, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కర్మిక వర్గ సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న "జైల్ భరో" కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజా, వర్గ సంఘాల నాయకులు కన్నెబోయిన యాదయ్య , వేముల సైదులు , గ్రామ కార్మికు లు బడే సత్తయ్య , కోట వెంకన్న , కిన్నెర రమేష్, కట్ట భిక్షం, నర్సింహా, యశోద పాల్గొన్నారు.

వెలుతురు
మెదక్, కరీంనగర్ జిల్లా
https://epaper.velthuru.com
మంగళవారం, 04 ఆగస్టు 2026

# కాంట్రాక్ట్ కార్మికులకు 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి కె. నర్సింలు డిమాండ్

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి కె. నర్సింలు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కమిషనర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. మే నెల వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను వెంటనే సంబంధిత సంస్థలకు చెల్లించాలని కోరారు. పెంచిన కనీస వేతనాలను అమలు చేయడంతో పాటు యూనిఫాంలు, ఐడీ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌస్, దత్తు రాములు, దత్తు రెడ్డి, నిరంజన్ రెడ్డి,



రమేష్, వీరన్న, శంకర్, సిద్దన్న, నరేష్, శేఖర్, అజయ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# భుత్వ భూముల ఆక్రమణలకు అధికారుల అండా?

- జహీరాబాద్ పాల శీతలీకరణ కేంద్రం భూమిపై జాగో తెలంగాణ తీవ్ర ఆరోపణలు

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్న పాల శీతలీకరణ కేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ భూమి క్రమంగా ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.పాల శీతలీకరణ కేంద్రానికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ యాజమాన్యం ప్రభుత్వ భూమిలోకి క్రమంగా విస్తరిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అంతేకాకుండా వరద కాలువ ఆక్రమణకు గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ కమర్షియల్ నిర్మాణాల మధ్య పురపాలక నిధులతో రోడ్లు, మురికి కాలువలు వంటి మౌలిక వసతులు కల్పించడం పట్ల కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్మాణాలకు అనుమతులు, భద్రతా నిబంధనలు, వాస్తవ నిర్మాణ పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరి




శీలించాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా అవసరాలకు ఉపయోగపడే విలువైన ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణల నుంచి కాపాడాలని పి. రాములు కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాగో తెలంగాణ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్, పి. అరవింద్, మాదినం శివప్రసాద్, ప్యార్ల దశరథ్, ఎస్. పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో రోడ్డు విస్తరణకు లైన్ క్లియర్

- ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా మున్సిపల్ అధికారుల నిర్ణయం....
- 40 అడుగుల విస్తరణ పనులకు సంబంధిత కౌన్సిలర్ల ఆమోదం...

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీలోని భవానీ మందిర్ రోడ్, హనుమాన్ మందిర్ రోడ్ల రోడ్డు విస్తరణ పనులపై సోమవారం చైర్‌పర్సన్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 27, 30, 31 వార్డుల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, సంబంధిత వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.రోడ్డు విస్తరణపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను కొనసాగించాలని నిర్ణయించారు. ఆమోదించబడిన మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తీర్మానించారు. నిబంధనల ప్రకారం పనులు కొనసాగించేందుకు సంబంధిత వార్డు కౌన్సిలర్లు అనుమతి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

# బోనాల ఉత్సవాలను విజయవంతం చేసినందుకు మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు ముదిరాజ్ సంఘాల ఘన సన్మానం

**కరీంనగర్ వెలుతురు ఆగష్టు 03:**



నగరంలోని 14 ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు బోనాల పండుగ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారిని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మేయర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి తమ అభినందనలు తెలిపారు. బోనాల ఉత్సవాల నిర్వహణకు నగరపాలక సంస్థ అన్ని విధాలుగా సహకరించడం వల్లే ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగాయని వారు పేర్కొన్నారు.మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఉత్సవాల నిర్వహణలో పాల్గొన్న నిర్వాహక కమిటీలు, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అన్ని మతాలు, వర్గాల పండుగలకు నగరపాలక సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో 14 ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమరసత సమాజ నిర్మాణమే బీజేపీ లక్ష్యం

- ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్

**జగిత్యాల వెలుతురు ఆగస్టు 3:**

సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్" కార్యక్రమాల వివరాలను తెలియజేయడానికి సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీడియా మిత్రులకు, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఎస్సీ సమాజ సోదర సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు. సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని నారపాక అశోక్ పేర్కొన్నారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారి సూచనల మేరకు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కాంతి కిరణ్ గారి నాయకత్వంలో వారణాసిలో సంత్ గురు రవిదాస్ మహారాజ్ సంచరించిన పవిత్ర ప్రదేశాల నుండి పవిత్ర మట్టిని సేకరించి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ గారి చేతుల మీదుగా కలశాన్ని స్వీకరించి తెలంగాణకు తీసుకువచ్చినట్లు అశోక్ వివరించారు.ఆదిలాబాద్ నుండి ప్రారంభమైన ఈ పవిత్ర కలశ యాత్ర తెలంగాణలోని ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామానికి చేరుకుని సంత్ రవిదాస్ మహారాజ్ సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందని, ఈ కార్యక్రమాలు 2026 జూలై 29, నుండి 2027 ఫిబ్రవరి 4 వరకు 6 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.సంత్ రవిదాస్ మహారాజ్ సమానత్వానికి, సామాజిక న్యాయానికి, మానవత్వానికి ప్రతీక అని నారపాక అశోక్ అన్నారు.కుల, మత, వర్గ వివక్షలను వ్యతిరేకిస్తూ "అందరూ సమానులే" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించారని, ప్రేమ, సేవ, భక్తి, సమరసత ఆయన జీవన తత్వమని పేర్కొన్నారు.సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలో సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం, సంత్ రవిదాస్ ఆశయాలను ప్రతి ఇంటికీ చేర్చడం, అలాగే "సబ్కా సాథ్ – సబ్కా వికాస్ – సబ్కా విశ్వాస్ – సబ్కా ప్రయాస్" అనే భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారిని, సంత్ రవిదాస్ మహారాజ్ వంటి మహనీయులను భారతీయ జనతా పార్టీ అత్యున్నత గౌరవంతో స్మరిస్తుందని నారపాక అశోక్ తెలిపారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, అలాగే ఆయనకు సంబంధించిన చారిత్రక ప్రదేశాలను కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిందని చెప్పారు.గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీపై రిజర్వేషన్ల అంశంలో అనేక దుష్ప్రచారాలు జరిగాయని, గతంలో దళితుల పట్ల చేసిన హామీలను నెరవేర్చకుండా వివిధ రాజకీయ పార్టీలు వ్యవహరించిన విషయాలను ప్రజలకు తెలియజేస్తూ ఎస్సీ సమాజంలో చైతన్యం తీసుకురావడం తమ బాధ్యతగా భావిస్తున్నామని



ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ వర్గాలు విశేష ప్రయోజనం పొందుతున్నాయని,ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో సామాజిక న్యాయం, సాధికారత, సమాన అవకాశాల దిశగా దేశం ముందుకు సాగుతోందని నారపాక అశోక్ పేర్కొన్నారు.తెలంగాణలో కూడా ఎస్సీ సమాజం మరింత అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ అభియాన్‌లో భాగంగా జగిత్యాల జిల్లాలో సంత్ రవిదాస్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం, దీప ప్రజ్వలన కార్యక్రమాలు, సమరసతా ప్రతిజ్ఞ, యువత, మహిళలు, ఎస్సీ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలతో అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు మరియు సామాజిక ఐక్యత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ పిలుపునిస్తూ, సంత్ రవిదాస్ మహారాజ్ చూపిన సమానత్వ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, కుల వివక్షకు తావులేని సమరస సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని నారపాక అశోక్ విజ్ఞప్తి చేశారు.భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నిర్వహిస్తున్న సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.చివరిగా, జగిత్యాల జిల్లా ప్రజలందరికీ సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నారపాక అశోక్ విజ్ఞప్తి చేశారు.ఈ జిల్లా పాత్రికేయుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్ర శేఖర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నలువల తిరుపతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, SIR జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, కార్యదర్శి జుంబర్తి దివాకర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేపీ నాయకులు మర్రిపెల్లి సత్యం, జున్ను రాజేందర్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు తడగొండ అంజయ్య, కొత్తూరి అంజి, బెక్కం అశోక్, సట్ట రవి రాజు, ఉయ్యాల స్వామి, కొత్తూరి బాబు, గిరిమ్మల్లా రఘు, అంకమళ్ల అనిల్, తదితర బీజేపీ నాయకులు ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# జడిమల్కాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జడిమల్కాపూర్ గ్రామంలోని లక్ష్మమ్మ దేవాలయం వెనుక అక్రమంగా మూడు పేకాట ఆడుతున్న 9 మందిని జహీరాబాద్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో దాడి నిర్వహించారు. ఈ దాడిలో నిందితుల నుంచి రూ.5,160 నగదు, 7 మొబైల్ ఫోన్లు, 52 పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. అక్రమ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ఇంటి ముందు చెత్త కుప్పలు.. స్థానికుల ఆందోళన



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు నల్సబ్ మొహల్లా కాలనీలో ఇంటి ముందు చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తతో దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. వెంటనే చెత్తను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తాగునీటి కోసం పబ్లిక్ వాటర్ ట్యాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# ఆకలితో అలమటిస్తున్న యువకుడికి అన్నం, దుస్తులు అందించిన భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధూ రావణ్

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 03:**

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్ధూ రావణ్ చాటుకున్నారు. జహీరాబాద్ జాతీయ రహదారి పక్కన ఆకలితో, చిరిగిన దుస్తులతో దీనస్థితిలో ఉన్న ఓ యువకుడిని గమనించిన ఆయన వెంటనే వాహనం ఆపి అతడి వద్దకు వెళ్లారు.యువకుడి పరిస్థితిని తెలుసుకుని స్వయంగా అన్నం తినిపించి, తాగునీరు అందించారు. అనంతరం నూతన దుస్తులు కొనుగోలు చేసి అందజేశారు.



ప్రాథమిక సహాయం అందించడంతో పాటు అతడిని సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేశారు.ఈ సేవా కార్యక్రమాన్ని చూసిన స్థానికులు, ప్రయాణికులు సిద్ధూ రావణ్‌ను అభినందించారు. జహీరాబాద్ జాతీయ రహదారి పక్కన ఆకలితో, చిరిగిన దుస్తులతో దీనస్థితిలో ఉన్న ఓ యువకుడిని గమనించిన ఆయన వెంటనే వాహనం ఆపి అతడి వద్దకు వెళ్లారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎంపీ పప్పుయాదవ్ పైన జరిగిన దాడికి ప్రధాన మంత్రి బాధ్యత వహించాలి

- **బీజేపీ పార్టీ ఓబీసీ ఎంపీలపై దాడులకు ప్రేరేపిస్తే దేశాన్ని అగ్ని గుండంగా మారుస్తాం**
- **మేకపోతుల నరేందర్ గౌడ్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**



న్యూఢిల్లీలో బీహార్ ఎంపీ పప్పు యాదవ్ ఢిల్లీలోని అయన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తుండగా, RSS/ బీజేపీ గుండాలు ఇద్దరు వెళ్లి పార్లమెంట్ సభ్యులు పప్పు యాదవ్ పైన కత్తులతో దాడికి యత్నించారు.సామాన్య పౌరులకే కాదు, బీజేపీ పాలనా హయాంలో ఎంపీ లకు కుడా రక్షణ లేకుండా పోయింది. శ్రీ రాముడి గుడి నిర్మాణానికి దేశా వ్యాప్తంగా వచ్చిన విరాళాలను, ట్రస్ట్ బోర్డు సభ్యులు వందలకోట్లు రూపాయలు, సీసీ టీవీ లకు అడ్డుగా నిలబడి బస్తాల కొద్దీ డబ్బులు, వందల కోట్లలో స్వాహా చేశారు అనేది జగమెరిగిన సత్యం. అన్నీ మీడియా, సోషల్ మీడియా లో, న్యూస్ పేపర్లలలో వచ్చిన మాట వాస్తవం. దానిని ప్రశ్నించిన ఎంపీ పప్పుయాదవ్ గారిపై భౌతిక దాడికి దిగటం ఎంతవరకు సమాజసం? శ్రీరాముడి హుండీ డబ్బులు కొట్టేస్తే దాన్ని ప్రశ్నించే హక్కు దేశ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు లేదా? ఇలా ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించాలి, ఎంపీ పప్పు యాదవ్ గారికి రక్షణ కల్పించాలి. తెలంగాణ రాష్ట్రం నుంచి మాజీ ఎంపీ, వి. హనుమంత రావు గారు జులై 24న న్యూ ఢిల్లీలో తెలంగాణ భవన్ లో అంబేద్కర్ విగ్రహం ముందు ఒక రోజు మౌన దీక్ష చేసారు. దేశం మొత్తం శ్రీరాముడికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తుంటే, రామమందిరం నిర్మాణం పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ పార్టీకి మాత్రం చీమైనా కుట్టినట్టులేదు, పైగా ప్రధాన మంత్రి గారు కనీసం స్పందించలేదు. కనీసం RSS చీఫ్ కూడా స్పందించలేదు, పైగా స్పందించిన వారిపైన దాడులకి దిగుతున్నారు.అయోధ్య రామ మందిరం అనేది, భారతీయ ప్రజలకు 500 సంవత్సరాల బావోద్వేగం, రామ మందిరం కోసం ఎందరో ప్రాణ త్యాగం, దాన త్యాగం చేసారు అని బీజేపీ వర్గాల వాళ్ళు తెలుసుకోవాలి, శ్రీ రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ పైన సిబిఐ తో విచారణ జరిపించాలి, జై శ్రీరామ్, జై హనుమాన్, జై బీసీ జై జై బీసీ..

## పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో నూతన పదవుల నియామకం

**పెద్ద అంబర్‌పేట్ వెలుతురు ఆగస్టు 03:**




పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం మరియు సంస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో క్రింది సభ్యులకు నూతనంగా వివిధ పదవుల బాధ్యతలను అసోసియేషన్ అధ్యక్షుడు , కార్యవర్గం ఏకగ్రీవంగా అప్పగిం చారు. కోశాధికారి మునుకుంట్ల శ్రీను, ఉపాధ్యక్షు డు ముక్కెర్ల లింగస్వామి, సహాయ కార్యదర్శులు కొండూరి వెంకన్న, వర్థం లింగస్వామి, ఆవుల చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శులు బోయపల్లి ప్రవీణ్, మునుకుంట్ల కుమార్, సలహాదారులు కొండూరి జలందర్, గురిజ సుధాకర్, కార్యవర్గ సభ్యులు వేముల నర్సింహా, మునుకుంట్ల నర్సింహా, కన్వీనర్లు మునుకుంట్ల చంద్రశేఖర్, రోండి సత్యం మెంబర్లు, ఆకుల శంకర్, బూడిద అశోక్, వడ్డేపల్లి ఐలయ్య, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికీ పెద్ద అంబర్ పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు , సభ్యు లందరూ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో అసోసియేషన్ అభివృద్ధికి విశేష కృషి చేసి సభ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూత నంగా నియమితులైన సభ్యులందరికీ హృదయ పూర్వక అభినందనలు , శుభాకాంక్షలు.

## అపూర్వ సమ్మేళనాన్ని జయప్రదం చేయుటకు ఇన్చార్జిల నియామకం

- **తొలుత ఉమ్మడి పది జిల్లాల ఇన్చార్జిల్లా నియామకం: డాక్టర్ పిడమర్తి రవి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

సెప్టెంబర్ 16న రెండు తరాల ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేయుట కొరకు ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో పది ఉమ్మడి జిల్లాలకి ఇన్చార్జిలను నియమించిన ఉద్యమ కారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి. జిల్లా ఇన్చార్జులు ఆ జిల్లాలలో సన్నహాక సభలు సమావేశాలు నిర్వహించి సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో చేపట్టిన రెండు తరాల ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేయవల సిందిగా విజ్ఞప్తి చేశారు.

**వరంగల్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్**
**ఖమ్మం-గడ్డం శ్రీరామ్**
**కరీంనగర్-డాక్టర్ కావేటి సతీష్ యాదవ్**
**మెదక్-అల్లుడు జగన్ ముదిరాజ్**



**రంగారెడ్డి-సంజయ్ గౌడ్**
**హైదరాబాద్- ముప్పూరి కుమార్**
**నిజామాబాద్- ఎండల ప్రదీప్**
**మహబూబ్నగర్-ఎండి రహీం**
**ఆదిలాబాద్-ఇండోల్ రాథోడ్**
**నల్లగొండ-నరేందర్ గౌడ్**

నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు గద్దల అంజిబాబు, ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్ నాయక్, ఉద్యమకారులు కందుల శ్రీను, డాక్టర్ అందే కృష్ణ, దర్శనం జాన్, దుడపాక సురేష్, బోరెల్లి సురేష్, జోగు గణేష్, నక్క మహేష్, మొగిలిగిద్ద ప్రసాద్ కల్వకుర్తి శ్రీశైలం ఆరెకంటి శ్రీకాంత్ సత్తి గాని సతీష్ మీసాల మహేష్ నాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 03:**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్లను నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ సి. నారాయణ రెడ్డి, గారు ఐ.ఏ.ఎస్. ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీమతి కిరణ్మయి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శాంతి శ్రీ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (DM&HO) శ్రీమతి స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీ సునీల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, CDPOలు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది మరియు DHEW సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ సి. నారాయణ రెడ్డి గారు మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పుట్టినప్పటి నుండి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుండి రక్షిస్తాయని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ – "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం: సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీమతి కిరణ్మయి గారు మాట్లాడుతూ, తల్లిపాలు ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మరియు ప్రభుత్వ ఉమ్మడి బాధ్యత అని అన్నారు. ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలంటే తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించి, తల్లులకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శాంతి శ్రీ గారు మాట్లాడుతూ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలిచ్చే అలవాటును ప్రోత్సహించాలని, అలాగే మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలే అందించాలని కోరారు.

## రాంగ్‌రూట్‌లో ప్రయాణించొద్దు.. వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల కౌన్సెలింగ్

**బషీర్ బాగ్ వెలుతురు 3 ఆగష్టు :**

హైదరాబాద్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలను ట్రాఫిక్ పోలీసులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించారు.రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వల్ల తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని వాహనదారులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రాంగ్‌రూట్‌లో వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జరిమానాలతో పాటు ఇతర శిక్షలకు కూడా గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.




## ఆగస్టు 23న సీపీఎస్ ఉద్యోగుల భారీ బహిరంగ సభ

**బషీర్ బాగ్ వెలుతురు 3 ఆగస్టు :**

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైద్రాబాద్ లో తెలంగాణ స్టేట్ కంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళన చేపట్టారు. .హైద్రాబాద్, నాంపల్లి, గృహకల్ప లో తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వ ర్యంలో ఉద్యోగులతో కలసి ధర్నా నిర్వ హించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు నరేంద ర్ మాట్లాడు తూ.. ఆగస్ట్ 23న హైద్రాబాద్ లో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహి




స్తామని,ప్రభుత్వం పై తమ పోరాటం తీవ్రతరం చేస్తామని నరేందర్ హెచ్చరించారు.

## సూపర్వైజర్ సిబ్బంది అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలి

- **ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి , ప్రగతి సాధించాలీ**
- **సీజనల్ వ్యాధుల నియంత్రణకు సూపర్వైజర్ సిబ్బంది. ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతర వైద్య సేవలు అందించాలి ,**
- **సీజన్ వ్యాధులు నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలి అని సూచించారు**
- **నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ సర్వే రెగ్యులర్గా చేస్తూ స్క్రీనింగ్, సస్పెక్స్ కేసులను ఆన్లైన్లో నిరంతరం నమోదు చేయాలి**
- **NCD స్క్రీనింగ్ , సస్పెక్ట్ పెంచాలి.ఫాలో అప్ కూడా తప్పకుండా చేయాలి**
- **బస్తి ప్రజలకు నాణ్యమైన నిరంతర ఆరోగ్య సేవలు అందించాలి.**
- **గర్భిణీ అని తెలియగానే గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయాలి.**
- **సూపర్ వైజరీ సిబ్బంది సమయపాలన పాటించాలి.**
- **నాణ్యమైన ఆ రోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలి**
- **గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు , వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలీ.**
- **పిల్లలందరికీ సంపూర్ణ పూర్తి టీకాలు ఇవ్వాలి.**
- **అన్ని రకాల మందులు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో & బస్తీ దవాఖానాలలో అందుబాటులో ఉన్నవని తెలియజేశారు.**




- **సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి**
- **డా: పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్.**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ సిబ్బంది, మలేరియా సిబ్బంది తో సమీక్ష సమావేశం సోమవారం రోజున జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం సికింద్రాబాదు సమావేశ మందిరంలో నిర్వహించ బడింది.ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది, సూపర్వైజర్ సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్య క్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కు సూపర్వైజర్ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతర వైద్య సేవలు అందించాలి.అలాగే ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారూ

ఓపి సేవలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని కోరారు. సూపర్ వైజరీ సిబ్బంది తప్పకుండా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షణ చేసి ఫీల్డ్ సిబ్బందికి ఎప్పటి కప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ మన ఆరోగ్య కార్యక్రమాల ఇండికేటర్స్ సకాలంలో పూర్తయ్యేటట్టు, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, సూపర్వైజర్స్ ఇబ్బంది అలసత్వము వహించకూడదు అని కోరారు.

HMIS మరియు MCH పోర్టల్ లో ప్రతిరోజు సమాచారను నమోదు చేయాలి.

ప్రతి ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వారిగా సమీక్షించడం జరిగింది. ఈ సమీక్షలలో లక్ష్యాలు సాధించని ప్రగతిపై నెల రోజులలోపు లక్ష్యాల ప్రగతి సాధించాలని సూచించారు.ఈ సమావేశంలో డా. చల్లాదేవి,జిల్లా టీబి అధికారి, అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , అడిషనల్ డిఎంహెచ్ఓ (ఎయిడ్స్ &, లెప్రసీ) డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా: శ్రీధర్, డా:సాయిబాబా , శ్రీ కళా , ఆశ్రిత రెడ్డి , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు,పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన సూపర్వైజర్స్ సిబ్బంది ,మలేరియా సిబ్బందికి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి సూచనలు, మార్గదర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.



## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

రాష్ట్రంలోని విద్యార్థులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎప్పుడు విడుదల చేస్తారో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానం చెప్పాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,అనేక కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండటంతో వారి చదువులు,భవిష్యత్తు అనిశ్చితిలో పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ముందుగా గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.పాత బకాయిలను పూర్తిగా చెల్లించిన తర్వాత కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజుల విషయాన్ని పరిశీలించాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకపై జాప్యం చేయకుండా పెండింగ్ బకాయిలన్నింటినీ అత్యవసరంగా విడుదల చేసి విద్యార్థులకు,వారి కుటుంబాలకు ఊరట కల్పించాలని జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ కార్యదర్శి కొప్పుల చందు గౌడ్ పాల్గొన్నారు.

# మీ సేవ ఆధునీకరణకు ప్రణాళిక

- ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో సీఎస్ సంజయ్ జాజు భేటీ
- మీ సేవ కేంద్రాల పటిష్టత, డిజిటల్ సేవల విస్తరణ
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో కీలక సమావేశం
- ప్రపంచ బ్యాంక్ ఉన్నతాధికారుల బృందంతో సిఎస్ చర్చలు
- వికసిత్ భారత్–2047 లక్ష్యాల వైపు వేగవంతమైన అడుగులు
- డిజిటల్ గవర్నెన్స్, ఏఐ, సైబర్ భద్రతపై ప్రాధాన్యం
- భారత్ ఫ్యూచర్ సిటీలో నూతన డేటా సెంటర్లు
- ఐటీ మౌలిక వసతులు, యువతకు ఉపాధి అవకాశాల పెంపు



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**

తెలంగాణ రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి, ప్రజలకు అత్యుత్తమ స్థాయి డిజిటల్ సేవలను అందించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి మీ సేవ కేంద్రాన్ని ఆధునికీకరించి, ప్రజలకు ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా పారదర్శక సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌నకు చెందిన డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో రాష్ట్ర ఐటీ, డిజిటల్ రంగానికి చెందిన పలు ప్రాజెక్టులపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి.ఈ సమావేశంలో ప్రధానంగా 'డిజిటల్ ఇండియా – వికసిత్ భారత్–2047' లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. దీనితో పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అధునాతన డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణ, ఐటీ రంగాన్ని ఆధారం చేసుకుని స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి అంశాలపై ప్రతినిధులు లోతుగా చర్చించారు.డిజిటల్ గవర్నెన్స్ రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రవేశపెడుతున్న నూతన సాంకేతికతను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాలను గణనీయంగా పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, డేటా గవర్నెన్స్ వంటి విభాగాల్లో ప్రపంచ బ్యాంక్ నుంచి అందించగల సాంకేతిక సహాయం, జ్ఞాన భాగస్వామ్యం , అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలపై మహేష్ ఉత్తమ్‌చందానీ తన అభిప్రాయాలను వెల్లడించారు.దేశంలో డిజిటల్, సాంకేతిక రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి హర్యానాతో పాటు తెలంగాణ రాష్ట్రం అత్యంత అనుకూలంగా ఉందని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు కొనియాడారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 2,000 కోట్ల విలువైన పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలను త్వరగా సిద్ధం చేసి తమకు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో సమావేశం అనంతరం, రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న టి–ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యమైన డిజిటల్ సేవల లభ్యత తదితర కీలక అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.టి–ఫైబర్ ప్రాజెక్టు కింద చేపడుతున్న పనులన్నింటినీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి, రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి, ప్రభుత్వ కార్యాలయానికి నాణ్యమైన డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎస్ ఆదేశించారు. విభిన్న ప్రభుత్వ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం సాధించి, ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పనుల పురోగతిని ప్రతి వారం నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ, టి–ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు వివిధ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమెరికా విధానాలపై గల్ఫ్ దేశాల అసహనం

- 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' సంచలన నివేదిక
- పశ్చిమాసియాలో ముదురుతున్న భద్రతాందోళనలు
- అమెరికా విధానాలపై గల్ఫ్ భాగస్వామ్య దేశాల అసంతృప్తి
- యూఎస్ వద్ద కొరవడిన స్థిరమైన వ్యూహం
- డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలపై పెరిగిన తీవ్ర అయోమయం
- ఇరాన్ ప్రతికార దాడులకు గల్ఫ్ దేశాలే బలిపశువులు
- చమురు క్షేత్రాలు, ఇంధన వసతులపై ముంచుకొస్తున్న ముప్పు

**వాషింగ్టన్, వెలుతురు, ఆగస్టు 3:**




ఇరాన్‌తో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలు పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర భద్రతాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికా అనుసరిస్తున్న అస్థిర విధానాలపై గల్ఫ్ దేశాలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్‌తో ఎలా వ్యవహరించాలనే దానిపై వైట్ హౌస్ వద్ద స్పష్టమైన మరియు స్థిరమైన వ్యూహం కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా చర్యల వల్ల ఇరాన్ చేసే భీకర ప్రతికార దాడులకు తామే మొదటి బలిపశువులుగా మారాల్సి వస్తోందని గల్ఫ్ భాగస్వామ్య దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ సంచలన విషయాలను అమెరికాకు చెందిన ప్రముఖ వార్తాపత్రిక 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' (WSJ) తన ప్రత్యేక నివేదిక ద్వారా బహిర్గతం చేసింది.వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిలో ఏమాత్రం స్థిరత్వం కనిపించడం లేదు. ఒకవైపు తీవ్రమైన సైనిక చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేయడం, మరుసటి రోజే దాడులను వాయిదా వేసి శాంతి ఒప్పందాలంటూ వ్యాఖ్యానించడం గల్ఫ్ దేశాలను అయోమయానికి గురిచేస్తోంది. అమెరికా యొక్క దీర్ఘకాలిక వ్యూహం ఏమిటో అర్థం కాకపోవడంతో ప్రాంతీయ భద్రత ప్రమాదంలో పడిందని గల్ఫ్ నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.అమెరికాతో యుద్ధ వాతావరణం మరింత ముదిరితే, ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై కంటే సమీపంలో ఉన్న గల్ఫ్ దేశాలపైనే విరుచుకుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా తమ చమురు క్షేత్రాలు, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ ప్రతికార దాడులు చేస్తుందని గల్ఫ్ దేశాలు భయపడుతున్నాయి. ఇరాన్ ప్రయోగించే ఆధునిక క్షిపణులు, డ్రోన్లను ఎదుర్కొనేందుకు తమ వద్ద ఉన్న వైమానిక రక్షణ వ్యవస్థలు సరిపోవని, అందుకే అమెరికా నుంచి అదనపు రక్షణ ఆయుధాలను మరియు రక్షణ హామీని ఈ దేశాలు కోరుతున్నాయి. హర్మ్యూజ్ జలసంధి మూతపడితే వ్యాపారం, చమురు ఎగుమతులు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సంక్షోభ పరిస్థితులపై ఇజ్రాయెల్ మాజీ సైనిక నిఘా అధికారి డాని సిట్రినోవిచ్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత వాతావరణంలో ఇజ్రాయెల్ ప్రధాని బెన్యామిన్ నెతన్యాహు కంటే గల్ఫ్ దేశాల నేతల మాటలకే ట్రంప్ వద్ద ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందని ఆయన తెలిపారు. గల్ఫ్ నాయకులు ప్రాంతీయ స్థిరత్వానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తారని, ఇరాన్ మౌలిక వసతులపై దాడులు జరిగితే దానికి ప్రతికారంగా ఇరాన్ తమ ఇంధన కేంద్రాలను ధ్వంసం చేస్తుందని వారు తీవ్రంగా భయపడుతున్నారని సిట్రినోవిచ్ విశ్లేషించారు.అయితే, ఇరాన్ సంక్షోభాన్ని ఎదుర్కొనే విషయంలో గల్ఫ్ మిత్రదేశాల మధ్యే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని డబ్ల్యూఎస్‌జే నివేదిక పేర్కొంది. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ పదే పదే ట్రంప్‌తో మాట్లాడుతూ దౌత్య మార్గాన్ని ఎంచుకోవాలని కోరుతున్నారు. యుద్ధం వస్తే తమ చమురు క్షేత్రాలు దెబ్బతింటాయని సౌదీ భావిస్తోంది. అందువల్ల అమెరికా బలవంతంగా హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు చేసిన సైనిక ప్లాన్‌ను కూడా సౌదీ తొలుత నిరోధించింది.మరోవైపు, సౌదీకి భిన్నంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మాత్రం ఇరాన్‌పై అత్యంత కఠినమైన సైనిక బలాన్ని ప్రయోగించాలని ట్రంప్‌పై ఒత్తిడి తెస్తోంది. ఇరాన్ విప్లవాత్మక గార్డ్స్ లొంగిరావాలంటే అమెరికా వైమానిక దాడులు నిర్వహించాలని, హర్మ్యూజ్ జలసంధిని తన పూర్తి సైనిక నిఘాలోకి తీసుకోవడమే కాకుండా అవసరమైతే మైదాన ప్రాంతాల్లో గ్రౌండ్ ఆపరేషన్లు కూడా చేపట్టాలని యూఏఈ గట్టిగా కోరుతోంది.ఈ యుద్ధ భయాల మధ్య అమెరికాలో ట్రంప్‌పై అంతర్గత రాజకీయ ఒత్తిడి తీవ్రమవుతోంది. త్వరలో రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఇరాన్‌తో పోరాటం అమెరికా ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందని, ఇది రిపబ్లికన్ పార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీస్తుందని ఆ పార్టీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలోని ఈ రాజకీయ బలహీనతను ఇరాన్ కూడా నిశితంగా గమనిస్తోంది.ఒకవేళ దౌత్య చర్చలు పూర్తిగా విఫలమైతే, అమెరికా తమపై దాడులు ప్రారంభించకముందే ముందస్తు ప్రతికార దాడులకు దిగేందుకు ఇరాన్ విప్లవాత్మక గార్డ్స్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఈ ఉద్రిక్త పరిస్థితులు ఎటు దారితీస్తాయోనని ప్రపంచ దేశాలు ఆందోళనగా వీక్షిస్తున్నాయి.

# న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- విపక్షాల నిరసనల నడుమే నిర్ణయం
- సుప్రీంకోర్టులో 38కి చేరనున్న జడ్జీల సంఖ్య
- 34 నుంచి పెంచుతూ లోక్‌సభలో కీలక బిల్లు ఆమోదం
- బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్
- విపక్షాల గందరగోళంతో మొదలైన చర్చ
- ఆందోళన పక్కనబెట్టి చర్చలో పాల్గొనాలని విపక్షాలకు సూచన
- ఎలాంటి చర్చ లేకుండానే చట్టసభ ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 3:**



దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 34 నుంచి 38కి పెంచేందుకు ఉద్దేశించిన అత్యంత కీలకమైన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రతిపాదనలకు చట్టసభ మద్దతు లభించడంతో న్యాయవ్యవస్థలో కీలక మార్పులకు బాటలు పడ్డాయి. అయితే, విపక్ష సభ్యుల తీవ్ర ఆందోళనలు, నినాదాల హోరు మరియు సభలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల నడుమే ఈ చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందడం విశేషం.కేంద్ర ప్రతిపాదనల ప్రకారం సుప్రీంకోర్టులో కేసుల విచారణ వేగవంతం చేసేందుకు న్యాయమూర్తుల సంఖ్య పెంపు అత్యంత అవసరమని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో కేంద్ర సరిహద్దు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టి సభ ముందుకు చర్చకు తీసుకువచ్చారు. కానీ బిల్లును ప్రవేశపెట్టిన నిమిషం నుంచే ప్రతిపక్ష ఎంపీలు సభ పోడియం వద్దకు చేరుకుని తీవ్ర స్థాయిలో నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగడంతో సభ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలకమైన బిల్లుపై ప్రతిపక్షాల సభ్యులందరూ సభా చర్చలో పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాలని లోక్‌సభ స్పీకర్ పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరినప్పటికీ విపక్ష సభ్యులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. తమ నిరసనలను కొనసాగిస్తూనే సభా సమయాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు.సభలో విపక్షాల తీవ్ర నిరసనలు, హంగామా మరియు నినాదాల మధ్య ఎటువంటి సమగ్ర చర్చ జరగకుండానే ఈ కీలక బిల్లుకు లోక్‌సభ వేగంగా ఆమోదముద్ర వేసింది. న్యాయమూర్తుల సంఖ్య పెంచడం అత్యవసరమైన అంశం కావడంతో ప్రభుత్వం బిల్లును సభ ముందుకు తెచ్చి ఆమోదింపజేసుకుంది.అంతకుముందు రోజు ప్రారంభంలోనే లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ సంఘటనలు, అయోధ్యలో విరాళాల చోరీ వంటి పలు సున్నితమైన, వివాదాస్పద అంశాలపై విపక్ష ఎంపీలు సభ ప్రారంభమైన వెంటనే ప్లకార్డులతో నినాదాలు చేస్తూ విరుచుకుపడ్డారు. ఈ ఆందోళనల కారణంగా సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తిగా స్థంభించిపోయింది.ఉదయం నుంచే ప్రతిపక్ష సభ్యుల వరుస నిరసనల కారణంగా లోక్‌సభ కార్యక్రమాలు పదేపదే అంతరాయానికి గురయ్యాయి. వేర్వేరు అంశాలపై విపక్షాలు పట్టుబట్టడంతో సభను అధికారులు పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. వాయిదాల అనంతరం సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పూ రాలేదు. ప్రతిపక్షాలు తమ ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి.గందరగోళ వాతావరణంలోనే సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 38కి పెంచే బిల్లు ఆమోదం పొందిన వెంటనే స్పీకర్ సభను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. విపక్షాల నిరసనలతో సభ ఏమాత్రం నడిచే పరిస్థితి లేకపోవడంతో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.ఏది ఏమైనప్పటికీ, లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందడం ద్వారా సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగి, వేలాదిగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం వేగవంతమవుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అత్యున్నత న్యాయస్థానంలో విచారణల వేగం పెరిగి, సామాన్య ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేందుకు ఈ బిల్లు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసన హోరు

- అమిత్ షా హాజరుపై విపక్షాల ప్రశ్నల వర్షం
- పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేతల ధర్నా
- హోంమంత్రి అమిత్ షా రావాలని డిమాండ్
- రామమందిర విరాళాల చోరీపై తీవ్ర ఆగ్రహం
- విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై నిరసన
- ప్లకార్డులతో హోరెత్తించిన విపక్షాలు
- మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 3:**



కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరు కావడంపై ప్రతిపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో విపక్షాల కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవల విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీఛార్జ్, అయోధ్య రామాలయ విరాళాల చోరీ వంటి కీలక అంశాలపై హోంమంత్రి తక్షణమే సభకు వచ్చి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.పార్లమెంట్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌లతో పాటు పలువురు విపక్ష ఎంపీలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. "అమిత్ షా పార్లమెంట్‌కు ఎందుకు రావడం లేదు?", "అమిత్ షా జవాబ్ దో" వంటి ప్రశ్నలతో కూడిన భారీ బ్యానర్లను, ప్లకార్డులను చేతిలో పట్టుకుని ప్రదర్శించారు. అయోధ్య రామమందిర నిధుల చోరీని ఎత్తిచూపుతూ "చందా చోర్– గద్దీ చోడ్" అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో నినాదాలు చేశారు.పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దారుణంగా లాఠీఛార్జ్ చేయడం, పెల్లెట్ తుపాకులు గురిపెట్టడంపై హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి పర్యవేక్షణలోనే ట్రస్ట్ ఉన్నప్పటికీ, శ్రీరామ మందిరానికి భక్తులు ఇచ్చిన విరాళాలు ఎలా చోరీకి గురయ్యాయో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేయాలన్నారు. ఈ నిరసనలో రాహుల్ గాంధీ, మహువా మొయిత్రా, సుప్రియా సూలే, సంజయ్ రౌత్ వంటి పలువురు అగ్రనేతలు పాల్గొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. జులై 20న విద్యార్థులు చేపట్టిన 'సంసద్ ఛలో' కార్యక్రమంలో పోలీసుల లాఠీఛార్జ్, బాష్పవాయు ప్రయోగం వల్ల విద్యార్థులు, పోలీసులు గాయపడిన ఘటనపై పార్లమెంట్‌లో సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టాయి.మరోవైపు రామమందిర విరాళాల చోరీ ఆరోపణలపై విపక్షాలు వినూత్న నిరసనలు తెలుపుతున్నాయి. పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్ ఒక సాధువు వేషధారణలో పార్లమెంట్ ఎదుట వ్యంగ్యాత్మక స్కిట్ వేయగా, అందులో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ ఘటన తదనంతరం పప్పు యాదవ్‌పై దాడి జరిగిందనే వార్తల నేపథ్యంలో, సోమవారం నాటి 11వ రోజు పార్లమెంట్ సమావేశాలు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి.ఈ విమర్శల హోరు నడుమ కేంద్ర ప్రభుత్వం 'విదేశీ విరాళాల నియంత్రణ చట్టం' (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే గనుక జరిగితే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం ఉంది.అయితే ఈ ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై తమకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. బిల్లు వచ్చినా రాకపోయినా, విద్యార్థులపై జరిగిన దాడులు, హోంమంత్రి గైర్హాజరుపై తమ నిరసనలు, ఒత్తిడి కొనసాగుతాయని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై హోంమంత్రి ప్రకటన చేసే వరకు తాము వెనక్కి తగ్గేది లేదని, ఉభయ సభల్లోనూ ఇదే అంశంపై నిరసనలు వ్యక్తమవుతాయని ప్రతిపక్ష నేతలు తెగేసి చెప్పారు. విపక్షాల వరుస నిరసనలతో పార్లమెంట్ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి.

# తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషన్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 5న భారీ ఎలక్ట్రికల్ టెక్నికల్ సెమినార్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషన్స్ జేఏసీ ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 5వ తేదీ (బుధవారం) హైదరాబాద్‌లోని శిల్పి గ్రాండ్ ఏసీ కన్వెన్షన్ హాల్, గ్రీన్ పార్క్ కాలనీ కమాన్ ఎదురుగా, కర్మన్‌ఘాట్‌లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు భారీ ఎలక్ట్రికల్ టెక్నికల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు జేఏసీ నిర్వాహకులు నక్క యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు & భవనాల అభివృద్ధి సంస్థ (RDC) చైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ రంగానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులు, ప్రముఖ ఇంజనీర్లు మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రిషన్ సంఘాల ప్రతినిధులు ఈ సెమినార్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.సెమినార్‌లో విద్యుత్ భద్రత, ఆధునిక ఎలక్ట్రికల్ సాంకేతిక పరిజ్ఞానం, తాజా విద్యుత్ నిబంధనలు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు మరియు భద్రతా ప్రమాణాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించనున్నారని తెలిపారు.అలాగే తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు, అసోసియేషన్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు మరియు వృత్తి నిపుణులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "శ్రమశక్తి పురస్కారం" అందుకున్న ఎలక్ట్రిషన్లను తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషన్స్ జేఏసీ తరఫున ఘనంగా సన్మానించనున్నట్లు నక్క యాదగిరి తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు, అసోసియేషన్ సభ్యులు, ప్రతినిధులు మరియు విద్యుత్ రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ టెక్నికల్ సెమినార్‌ను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.న ఈ కార్యక్రమంలో వై వెంకటేశ్వర్లు. కొండ బాల్రెడ్డి. నేమాల బెనర్జీ. ఉదయ్ భాస్కర్. పొదిల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూ పాత్రికేయులను సత్కరించిన మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్

- పాత్రికేయుల సంక్షేమం, ఉర్దూ భాషాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 03:**



తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ & పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ గౌరవ మంత్రి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్ గారు, నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో నిర్వహించిన తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TUWJF) 10వ వ్యవస్థాపక దినోత్సవం & వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు, మీడియా ప్రతినిధులు, ప్రముఖులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, పాత్రికేయ వృత్తి అత్యంత గొప్పది, బాధ్యతాయుతమైనది, పవిత్రమైనదని పేర్కొన్నారు. సమాజానికి నిజాలను బాధ్యతాయుతంగా అందిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు.పాత్రికేయుల సేవలను కొనియాడుతూ, సమాజ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులు అత్యున్నత గౌరవానికి అర్హులని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉర్దూ భాష పరిరక్షణ, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడం, సమాజానికి సేవ చేయడంలో ఉర్దూ పాత్రికేయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడిగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, మైదానంలో ఎలా అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషి చేశానో, అదే నిబద్ధతతో ప్రజాప్రతినిధిగా తెలంగాణ ప్రజలకు నిజాయితీ, అంకితభావంతో సేవలందిస్తున్నానని తెలిపారు.నిర్మాణాత్మకమైన, బాధ్యతాయుతమైన విమర్శలు ప్రజాస్వామ్యానికి బలమని మంత్రి పేర్కొన్నారు. వాస్తవాల ఆధారంగా చేసే విమర్శలు ప్రభుత్వానికి లోపాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని అన్నారు. పాత్రికేయులు ఎల్లప్పుడూ నైతిక విలువలు, వాస్తవాలు, ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం, మీడియా, సమాజం కలిసి పనిచేస్తేనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న మంత్రి, పాత్రికేయుల సంక్షేమంతో పాటు ఉర్దూ భాష పరిరక్షణ, అభివృద్ధి, ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా TUWJF అధ్యక్షుడు శ్రీ ఎం.ఎ. మాజిద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్, ఫెడరేషన్ సభ్యులు పాత్రికేయుల సంక్షేమం కోసం నిరంతరం చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు. పదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఫెడరేషన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అవార్డు గ్రహీతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీ మహమ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్తో కలిసి ఉర్దూ జర్నలిజంలో విశిష్ట సేవలు అందించిన పలువురు పాత్రికేయులకు ప్రశంసాపత్రాలు, శాలువాలు, జ్ఞాపికలు మరియు రూ.10,000 నగదు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (TMREIS) వైస్ చైర్మన్ & అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి, తెలంగాణ ఉర్దూ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ వి. కృష్ణ, TUWJF అధ్యక్షుడు శ్రీ ఎం.ఎ. మాజిద్, ఫెడరేషన్ పదాధికారులు, ప్రముఖ పాత్రికేయులు, సంపాదకులు, రచయితలు, మీడియా ప్రతినిధులు, హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.ఉర్దూ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేయడం, పాత్రికేయుల సంక్షేమాన్ని పరిరక్షించడం, ప్రభుత్వం—మీడియా మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేయాలనే సంకల్పంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# నిజామాబాద్ జీజీహెచ్‌కి సరికొత్త రూపం

- సచివాలయంలో జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్షా సమావేశం
- జిల్లా వైద్య రంగంపై సమగ్ర సమీక్ష
- మెడికల్ కాలేజీ, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల పనితీరుపై ఆరా

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)ను ప్రధాన రిఫరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. భవిష్యత్తులో ఈ ఆస్పత్రి ద్వారా కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి కీలకమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. పేద ప్రజలకు మెరుగైన నిర్ధారణ పరీక్షల కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎంఆర్ఐ యంత్రాన్ని త్వరలోనే కొనుగోలు చేసి సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జీజీహెచ్, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) మరియు సబ్ సెంటర్లలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత, జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని ఆస్పత్రుల పరిస్థితిపై అందించిన సూచనలను నోట్ చేసుకుని, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై సామాన్య ప్రజల్లో విశ్వాసం గణనీయంగా పెరిగిందని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రులతో పాటు నిజామాబాద్ జీజీహెచ్‌లో బెడ్ల కోసం ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రజల నుంచి ఫోన్లు వస్తున్నాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులను మరింతగా బలోపేతం చేసి అన్ని రకాల చికిత్సలు అందిస్తే, హైదరాబాద్‌లోని ప్రధాన ఆస్పత్రులపై రోగుల ఒత్తిడి చాలావరకు తగ్గుతుందని స్పష్టం చేశారు.సమీక్షా సమావేశంలో స్థానిక నియోజకవర్గాల అవసరాలను ప్రజాప్రతినిధులు మంత్రికి వివరించారు. అంకాపూర్‌లో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని కోరగా, దానికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పీహెచ్‌సీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నందిపేట్ పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయడం, ఇందల్వాయిలో అత్యవసర చికిత్సల కోసం ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం వంటి ప్రతిపాదనలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.జిల్లా పరిధిలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నియామకాలు చేపట్టిందని మంత్రి వెల్లడించారు. ఇటీవల ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో 18 మంది గైనకాలజిస్టులు, 22 మంది అనస్థీషియా స్పెషలిస్టులు, 22 మంది పిడియాట్రీషియన్లతో పాటు సుమారు 330 మంది నర్సింగ్ ఆఫీసర్లకు పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ఈ నెలాఖరు నాటికి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ తదితర విభాగాల్లోనూ ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్ల నియామక ప్రక్రియ పూర్తి చేసి, జిల్లాలో ఎలాంటి సిబ్బంది కొరత లేకుండా చూస్తామని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో మానవ వనరులు (హెచ్‌ఆర్), అత్యాధునిక వైద్య పరికరాలు, మందుల కొరత లేకుండా చూడటం, ఉచిత డయాగ్నస్టిక్ సేవలను పటిష్టం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని దామోదర్ రాజనర్సింహ చెప్పారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రజాప్రతినిధులు కూడా స్థానిక ఆస్పత్రుల పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి. సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, రేకులపల్లి భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. అధికారుల తరఫున ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, నిజామాబాద్ డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ తదితరులు హాజరయ్యారు.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 3:**

రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్థమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### అపోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా తెలంగాణలోని ప్రాంతాలపై పడే సంభావ్య ప్రభావాన్ని కూడా సమావేశంలో విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.తెలంగాణ వాదన కేవలం అంచనాలపై కాకుండా విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు.

పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత కేంద్ర సంస్థలదేనని సమావేశంలో స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణకు సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వీ. రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (అడ్మిన్) పి.శ్రీనివాస్, ఇంజినీర్–ఇన్–చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కే"సముద్రం"లో జనసంద్రంగా గీతన్నల జైత్ర యాత్ర

- కేజీకేఏస్ రాష్ట్ర బృందానికి గజమాలతో ఘన స్వాగతం
- గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్
- గీతన్నలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి
- రాష్ట్ర అధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు
- కేజీకేఏస్ రమణ ప్రతిపాదించిన డిమాండ్లను వేం నరేందర్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తా
- సమ్మయ్య గౌడ్

**కేసముద్రం వెలుతురు ఆగస్టు 03:**

గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన "అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర" కేసముద్రంలో జనసంద్రంగా కొనసాగింది. కేజీకేఏస్ మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, కేజీకేఏస్ కార్యదర్శి మేడం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ అధ్యక్షన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మహబూబాబాద్ జిల్లాలో నిన్న ప్రారంభమైన ఈ యాత్రలో భాగంగా సోమవారం కేసముద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కేసముద్రం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి గౌడన్నలు, గీత కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 1,000 ద్విచక్ర వాహనలపై, 2,000 మందికి పైగా గౌడన్నలు, గీత కార్మికులు, యువకులతో ఈ చైతన్య యాత్ర ఘనంగా సాగింది.కే"సముద్రం" పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గోపా డివిజన్ అధ్యక్షులు, చిలువేరు సమ్మయ్య గౌడ్ కేజీకేఏస్ రాష్ట్ర బృందానికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఫ్లైఓవర్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే సెంటర్‌కు చేరుకుని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను కొనసాగించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ , రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, గీత కార్మికుల సమస్యలను గ్రామస్థాయి నుంచి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు ప్రధాన డిమాండ్లను ఉంచారు. గీత కార్మికుల ఎక్స్‌గ్రేష ియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గీత కార్మికులకు తాటి, ఈత చెట్లు ఎక్కడానికి అవసరమైన రక్షణ కిట్లు, భద్రతా పరికరాలను పూర్తిస్థాయిలో అందించాలని, జనగామ జిల్లాకు సర్దార్ పాపన్న పేరును పఆమోదించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదాలకు గురయ్యే గీత కార్మికులకు మెరుగైన భద్రతా సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని, గౌడ సమాజ చారిత్రక వారసత్వానికి ప్రతీక అయిన శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్ మీద వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

### గీతన్నలకు అండగా ఉంటా: గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్

ఈ సందర్భంగా గోపా డివిజన్ అధ్యక్షులు, చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ KGKS ఆధ్వర్యంలో చేపట్టిన గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సు యాత్రకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కేజీకేఏస్ అధ్యక్షులు ఎంవీ రమణ, బెల్లంకొండా వెంకటేశ్వర్లు ప్రతిపాదించిన న్యాయపరమైన డిమాండ్లను మా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ గార్ల సహకారంతో మా కేసముద్రం గడ్డ ముద్దుబిడ్డ రాజ్యసభ సభ్యులు గౌరవ వేం నరేందర్ రెడ్డి గారి దృష్టికి మీ కేజీకేఏస్ అధ్యక్ష కార్యదర్శులతో రాష్ట్ర కార్యవర్గంతో వారిని కలిసి మీరు చేసినటువంటి డిమాండ్ లను వారి దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి గారితో మీ,మన సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని సమ్మయ్య గౌడ్ అన్నారు.కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న గీత కార్మికుల కుటుంబాలు, గౌడ సమాజం విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు అందేలా పిల్లలకు మెరుగైన విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గౌడ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు, గీతన్నల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టికి అన్ని అంశాలను తీసుకెళ్లి, పరిష్కారం జరిగే వరకు వారికి అండగా ఉంటాను" అని చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు గీత కార్మికులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని. ఐక్యతతోనే గీత కార్మికుల హక్కులను–సాధించుకోవచ్చని అన్నారు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి గౌడన్నకు, గీత కార్మికులకు, యువతకు, గ్రామ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘాల నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న,రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,బన్నీ వెంకట మల్లయ్య , వి. వెంకట నరసయ్య, గౌని సాంబయ్య, చౌగాని సీతారాములు, ఎస్. రమేష్ గౌడ్, ఎస్. వెంకట్ గౌడ్, యమగాని వెంకన్న, గోడం వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి, బుర్ర సుధాకర్, తాళ్లపల్లి నర్సయ్య, బాలబోయిన రాంబాబు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల మండల సొసైటీ కార్యవర్గ నాయకులు, గౌడ యువజన నాయకుడు, గీత కార్మికులు, గౌడ సంఘాల ప్రతినిధులు, బహుజన కుల సంఘ నాయకులు, మాజీ కార్యవర్గ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రకు సంఘీభావం తెలిపారు











# సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో కీలక ఘట్టం రంగం కార్యక్రమం ప్రారంభం

- రంగంలో కార్యక్రమంలో భాగంగా పచ్చి మట్టి కుండపై నిలబడి అమ్మవారిని ఆవాహన చేసుకుని భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రినిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ , కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**





సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి.. అమ్మవారి రంగం కార్యక్రమంలో భవిష్యవాణి తెలిపారు..తెలంగాణ లో మంచి వర్షాలు పడతాయని అమ్మవారు చెప్పారు.రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని తెలంగాణ సాంప్రదాయ ఆచారలతో ఆషాఢ మాస బోనాలకు ప్రభుత్వం తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగింది..దేవాదాయ శాఖ, రెవెన్యూ అన్ని విభాగాల శాఖలు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగింది

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఉచిత బస్సు ప్రయాణం.. మంచి సౌకర్యాలతో మూడింతలు భక్తులు వచ్చారు.. కొంత భక్తులకు ఇబ్బంది కలిగింది..

హైదరాబాద్ ప్రజలకు ధన్యవాదాలు.. బోనాల సందర్భంగా లక్షలాది మంది వచ్చిన ట్రాఫిక్ తదితర ఇబ్బందులు కలిగిన సహకరించారు..

రెవెన్యూ, పోలీస్ ,దేవాదాయ శాఖ, అన్ని విభాగాల సమన్వయం తో బోనాలు సమర్ధవంతంగా నిర్వహించడం జరిగింది..

దేవాలయాలకు వెళ్లినపుడు దర్శనాలకు గుర్తింపు కార్డు ఇవ్వాలని జోగిని లు కోరారు..

జోగిని లకు మున్సిపల్ కోపరేషన్ లో సభ్యులు గా ఇవ్వాలని వారికి కేబినెట్ నిర్ణయించింది.. వారికి ఉద్యోగాలు ఇస్తున్నాం..

దేవాదాయ శాఖ కమిటీ కి సంబంధించి వారికి గుర్తింపు ఇచ్చే విషయంలో ప్రభుత్వం పరిశీలిస్తుంది..

అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇక్కడే ఉన్నారు అధికారులతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి నివేదిక మీద ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది..

# కమ్యూనిస్టులు బిజెపి తొత్తులు అన్నా మీకు సిగ్గులేదు

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు ఆగస్టు 03:**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలు రంగ రంగ వైభవంగా జరిగి ప్రజలు ఆనందిస్తుంటే ఓర్చుకోలేని కమ్యూనిస్టు పార్టీ నేత రామకృష్ణ గారు నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ విమర్శించారు. లక్షలాది మందిని తీసుకొచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు అంటున్న రామకృష్ణ గారు మొన్నటి వరకు కేరళ రాష్ట్రంలో 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మీరు ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం సమయానికి జీతాలు ఇవ్వలేకపోయిన మీరు అక్కడి హైకోర్టు కూడా మా ప్రభుత్వం దివాలా తీసింది అంటూ అధికారిక ఎఫిడివ్యాక్ట్ ఇచ్చిన మీరు ఈ విధంగా లక్షలాదిమందితో సభలు సమావేశాలు ఎప్పుడు నిర్వహించుకో లేదా..?? గుండె మీద చెయ్యి వేసుకొని నిర్వహించలేదు అని చెప్పగలరా...??

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ప్రధాని మోడీ గారిని అభినందిస్తూ ప్రసంగిస్తే దాన్ని కూడా తప్పుపడుతూ సిగ్గుందా అని నిలదీస్తున్న మీకు నా సూటి ప్రశ్న... ఇటీవల ముగిసిన కేరళ రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ గారు కేరళలో అనేక సభల్లో ప్రసంగిస్తూ కమ్యూనిస్టులు భారతీయ జనతా పార్టీతో కొమ్మక్కైపోయారని, ముఖ్యమంత్రి విజయ్ గారు ప్రధాని మోడీ తొత్తని ఊరువాడ ప్రచారం చేసి మిమ్మల్ని ఓడిస్తే... కనీసం ఆత్మాభిమానం కూడా లేకుండా ఏ కాంగ్రెస్ పార్టీ అయితే మిమ్మల్ని తిట్టిందో ఓడించిందో అదే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండీ కూటమిలోనే రాహుల్ గాంధీ చంకలోనే ఉంటున్న మీకు అసలు సిగ్గు ఎగ్గు ఉందా..?? కాంగ్రెస్ ఒళ్ళోనే ఉంటూ సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తున్న మీకు మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఉందా... ??

భారతదేశంలో పరిశ్రమలు రాకుండా వచ్చినా వాటిని నడవనివ్వకుండా దేశం అభివృద్ధి చెందనివ్వకుండా చైనా ఎజెండాని వారి తొత్తులుగా మీరు అమలు చేస్తున్నారు కాబట్టే దేశ ప్రజలు మిమ్మల్ని చిట్కారించుకున్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగితే చైనా కమ్యూనిస్టు పార్టీకి మద్దతుగా నిలిచి భారతదేశానికి వెన్నుపోటు పొడిచిన పార్టీ మీది. భారత వీర జవాన్లకి రక్తం కూడా ఇవ్వకూడదంటూ కమ్యూనిస్టు కేంద్ర కమిటీలో తీర్మానం కూడా చేసిన దేశద్రోహులు మీరు. ఈ దేశం అశాంతిగా ఉండాలని నక్సలిజాన్ని కూడా పెంచి పోషించిన దుర్మార్గులు మీరు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనాతో చట్టపట్టాలేసుకుని తిరుగుతూ వారితో కలిసి 100 సంవత్సరాల కమ్యూనిజం అంటూ ఉత్సవాలు చేసుకున్న మీరు ముమ్మాటికి దేశద్రోహులే. మీ యొక్క నిజస్వరూపం ప్రజలు తెలుసుకున్నారు కాబట్టే ఈరోజు దేశం కమ్యూనిస్టు ముక్త్ భారత్ అయింది.

రామకృష్ణ గారు ఈరోజు మీరు స్వేచ్ఛగా ప్రధానమంత్రిని ముఖ్యమంత్రిని విమర్శిస్తూ దర్జాగా ధర్నాలు దీక్షలు చేయగలుగుతున్నారు కానీ మీ కమ్యూనిస్టు పాలిత దేశాలలో ఎవరన్నా ప్రజలు బయటకు వచ్చి ప్రభుత్వంపై నిరసన తెలియజేసే స్వేచ్ఛ ఉందా..?? అలా చేస్తే వాళ్ళని బత కనిస్తారా..?? ఆయా దేశాల్లో ఎన్ని లక్షల మందిని ఇప్పటివరకు పొట్టన పెట్టుకున్నారో లెక్కలు తెలియదు అనుకుంటున్నారా..?? కమ్యూనిస్ట్ దేశాల్లో ఉన్నది నియంతృత్వం. అక్కడ బ్యాలెట్ ఉండదు బుల్లెట్ మాత్రమే ఉంటుంది. ప్రజాస్వామ్యం దరిదాపుల్లో కూడా కనపడదు. ఇటువంటి అప్రజాస్వామిక విధానాలని ప్రోత్సహించే పరాయి దేశ భావజాలాన్ని దిగుమతి చేసుకొని భారతదేశంలో రాజకీయాలు చేస్తున్నందుకు మీకు ఉండాలి సిగ్గు. ప్రధాని నరేంద్ర మోడీ గారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిపై అనుచిత విమర్శలు మానుకోవాలని హితవు పలుకుతున్నాను.




పెద్దిరెడ్డి రవికిరణ్,
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

# నారాయణపేట, వనపర్తి జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష సమావేశం

- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి... వాకిటి శ్రీహరి
- ప్రతి రెండు గ్రామాలకు ఒక విద్యుత్ సబ్ స్టేషన్ ఉండాలి..... వాకిటి శ్రీహరి
- నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్ఫార్మర్లను దిమ్మెల పై ఉంచే ఏర్పాటు చేయాలి... వాకిటి శ్రీహరి
- విద్యుత్ సరఫరాలో మక్తల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలవాలి..... వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**

హైదరాబాద్ లోని మంత్రి గారి క్యాంపు కార్యాలయం లో సోమవారం రోజున నారాయణపేట, వనపర్తి జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గం లో వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరాపై,గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తాగు నీటికి,సాగునీటికి నాణ్యమైన 3 ఫేస్ విద్యుత్ ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లోని ప్రతీ రెండు గ్రామాలకు ఒక విద్యుత్ సబ్ స్టేషన్ ను నిర్మించాలని మంత్రి ఆదేశించారు.ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నేలపై ఉన్న ట్రాన్స్ఫార్మర్లను దిమ్మపై ఉంచేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.లాగే గ్రామాల్లో వీధి విద్యుత్ దీపాలకు టైమర్లు అమర్చి సమయం ప్రకారం వెలిగేలా పర్యవేక్షణ చేపట్టాలని, పనిచేయని దీపాలను వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లను తాకుతూ వెళ్లిన కరెంటు లైన్లను షిఫ్టింగ్ చేయాలన్నారు.రోడ్లకు అడ్డంగా ఉన్న కరెంటు పోల్ లను మార్చివేయాలని సూచించారు.ప్రజలకు విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా వేగంగా పరిష్కరించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. తగినంత సిబ్బందిని నియమించుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని బడులకు విద్యుత్ లో ఏలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా సప్లై చేయాలన్నారు. అన్ని మతాల స్మశాన వాటికల్లో విద్యుత్ దీపాలు తప్పనిసరి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇన్ని ఏండ్లు మక్తల్ ను ఎవ్వరూ పట్టించుకోలేదని, విద్యుత్ సరఫరాలో మక్తల్ నియోజకవర్గం ఆదర్శంగా ఉండాలని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశంలో ఇరు జిల్లాల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొని జిల్లాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితి, చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రికి వివరించారు.



# మోదీ, బీజేపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోంది

- బంకిపూర్ ఉప ఎన్నిక ఫలితమే అందుకు నిదర్శనం
- దేశంలో మార్పు కోరుకుంటున్న జెన్‌జీ
- రాహుల్‌గాంధీ నాయకత్వానికి యువత మద్దతు పెరుగుతోంది
- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 03:**



దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు) మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితమే ఇందుకు నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలో ఆ పార్టీ ఓటమి ప్రజల్లో వస్తున్న మార్పునకు సంకేతమని తెలిపారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రాతినిధ్యం వహించిన బంకిపూర్‌లో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ఓటమి పాలవడం గమనించాల్సిన పరిణామమన్నారు. మూడు దశాబ్దాలుగా బీజేపీకి పట్టున్న ప్రాంతంలో జన్ సురాజ్ నేత ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ద్వారా ప్రజలు బీజేపీకి గట్టి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. అధికార బలం, ప్రచార ఆర్భాటం ఎంత ఉన్నా ప్రజల తీర్పును మార్చలేరని ఈ ఫలితం మరోసారి నిరూపించిందన్నారు.

దేశ యువతలో కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని వివేక్ వెంకటస్వామి అన్నారు. ముఖ్యంగా జెన్‌జీ యువత ఉపాధి, నిరుద్యోగం, విద్యార్థుల సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నిస్తోందన్నారు. కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి మోసం చేసిన విషయాన్ని ప్రజలు ఇంకా మరచిపోలేదని అన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో పేరుకుపోయిన నిరాశ, అసంతృప్తి ఇప్పుడు ఓటు రూపంలో వ్యక్తమవుతోందని అన్నారు.

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అండగా నిలవడం దేశ యువతకు బలమైన సందేశాన్ని ఇచ్చిందన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీ నాయకత్వానికి యువత మద్దతు పెరుగుతోందని తెలిపారు.

బంకిపూర్ తీర్పును కేవలం ఒక నియోజకవర్గ ఫలితంగా చూడకూడదని, దేశంలో వస్తున్న రాజకీయ మార్పునకు సంకేతంగా భావించాలని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల గొంతుకను అణచివేయడం ఎవరి వల్లా కాదని అన్నారు. సరైన సమయంలో ఓటుతోనే ప్రజలు సమాధానం చెబుతారని అన్నారు. బంకిపూర్‌లో బీజేపీ కంచుకోట బద్దలవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం అని అన్నారు.

దేశవ్యాప్తంగా మార్పు మొదలైందని, బీజేపీకి ఆదరణ తగ్గుతుండగా కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. మోదీ, బీజేపీ గ్రాఫ్ పడిపోతుండగా రాహుల్ గాంధీ నాయకత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ మరింత బలపడుతుంది అని వివేక్ వెంకటస్వామి అన్నారు.

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగాల తుది ఫలితాలు విడుదల

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 3:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఉద్యోగం సాధించాలని నిరుద్యోగ అభ్యర్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న శుభవార్తను తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) అందించింది. ఆర్టీసీ సంస్థలోని డ్రైవరు మరియు శ్రామిక్ పోస్టుల భర్తీ ప్రక్రియ ముగింపునకు రావడంతో, ఎంపిక చేసిన అభ్యర్థుల తుది ఫలితాలను బోర్డు సోమవారం అధికారికంగా విడుదల చేసింది. రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన వివరాల ప్రకారం మొత్తం 1,743 పోస్టుల భర్తీ కోసం ప్రక్రియ జరగగా, అందులో 1,604 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు తుది ఎంపిక చేసినట్లు బోర్డు వెల్లడించింది.గతంలో అనగా 2025 సెప్టెంబర్ 17వ తేదీన ఆర్టీసీలో ఖాళీల భర్తీకై బోర్డు ఒక భారీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ ప్రకటన ఆధారంగా సుదీర్ఘంగా సాగిన వివిధ రౌండ్ల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, అర్హులైన 1,604 మంది అభ్యర్థులతో తుది ఎంపిక జాబితాను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా కేటాయించిన 1,000 డ్రైవర్ పోస్టులకు గాను 894 మంది అభ్యర్థులు తుది జాబితాలో నిలవగా, 743 శ్రామిక్ పోస్టులకు గాను 710 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను పోస్టుల వారీగా బోర్డు అందుబాటులో ఉంచింది.పోటీ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొన్న డ్రైవర్ పోస్టుల అభ్యర్థులకు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్‌ను అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ అకౌంట్లలో అందుబాటులోకి తెచ్చినట్లు బోర్డు తెలిపింది. ఫలితాలతో పాటు వివిధ కేటగిరీలకు సంబంధించిన తుది కట్ ఆఫ్ మార్కుల వివరాలను కూడా టీఎస్ఎల్‌పీఆర్‌బీ తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. అయితే, ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం అనేది వారి క్యారెక్టర్, పూర్వాపరాల (యాంటీసిడెంట్స్) పోలీసు వెరిఫికేషన్‌తో పాటు, వైద్య పరీక్షల్లో (మెడికల్ ఫిట్‌నెస్) సాధించే అర్హతపైనే ఆధారపడి ఉంటుందని రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.ఎంపికైన అభ్యర్థులు అనుసరించాల్సిన తదుపరి వివరాలను బోర్డు క్షుణ్ణంగా వివరించింది. అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆగస్టు 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు తమ అటెస్టేషన్ ఫారాన్ని టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో సమర్పించిన ఈ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి. ఆపై నిర్దేశిత ప్రదేశాల్లో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అంటించి, అభ్యర్థి సంతకాలు చేసి, తప్పనిసరిగా గెజిటెడ్ అధికారితో ధృవీకరణ (అటెస్టేషన్) పూర్తి చేయించాల్సి ఉంటుంది.ఇలా సిద్ధం చేసుకున్న మూడు సెట్ల అటెస్టేషన్ ఫారాలను, దానికి జతగా తమ విద్యార్హతలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల ప్రతులను జతపరచాలి. ఈ పత్రాలన్నింటినీ ఈ నెల 17వ తేదీన సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయంలో గానీ లేదా పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో గానీ స్వయంగా వెళ్లి అధికారులకు సమర్పించాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తమ ప్రకటనలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత గడువులోగా పత్రాలు అందజేయని వారి అభ్యర్థిత్వాన్ని పరిశీలించబోమని స్పష్టం చేసింది.స్వతంత్ర తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ సంస్థలో ప్రభుత్వ పరంగా వెలువడిన మొట్టమొదటి ప్రత్యక్ష నియామక నోటిఫికేషన్ ఇదేనని వివిధ ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనాలు లభించనున్నాయి. డ్రైవర్ పోస్టుకు నెలకు ప్రారంభ బేసిక్ పే రూ. 20,960 నుంచి గరిష్టంగా రూ. 60,080 వరకు స్కేలు ఉంటుంది.




అలాగే శ్రామిక్ పోస్టుకు ఎంపికైన వారికి ప్రారంభ బేసిక్ పే రూ. 16,550 నుంచి రూ. 45,030 వరకు ఉంటుంది. ఈ మూల వేతనానికి అదనంగా సంస్థ నిబంధనల ప్రకారం ప్రభుత్వం అందించే ఇతర భత్యాలు (అలవెన్సులు) కూడా తోడవుతాయి.అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ పునర్నిర్మాణంలో భాగంగా దాదాపు 3 వేల ఖాళీలను భర్తీ చేస్తామని పలు పర్యాయాలు స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఆర్థిక శాఖ కూడా సుమారు 3 వేల పోస్టుల భర్తీకి సూత్రప్రాయ అనుమతులు ఇచ్చింది. అయితే మొదటి విడత కింద రిక్రూట్‌మెంట్ బోర్డు 1,743 పోస్టుల భర్తీకే ప్రకటన విడుదల చేసి, ఎంపిక ప్రక్రియను సఫలంగా ముగించింది. రాబోయే రోజుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.గత కొన్నేళ్లుగా కొత్త నియామకాలు లేక, సిబ్బంది రిటైర్మెంట్ల వల్ల ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న ప్రస్తుత ఉద్యోగులపై, డ్రైవర్లపై తీవ్రమైన పని భారం పడుతోంది. షిఫ్టుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో, ఇప్పుడు కొత్తగా 1,604 మంది డ్రైవర్లు మరియు శ్రామిక్‌లు విధుల్లోకి చేరడం వల్ల సంస్థకు, తోటి ఉద్యోగులకు ఎంతో ఊరట కలగనుంది. ప్రజలకు కూడా బస్సు సర్వీసులు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# కేంద్రానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశం

- **ఆక్రమణలకు గురికాకుండా స్పష్టమైన గుర్తులు**
- **వాహనాల భయం లేకుండా నడిచేలా ఏర్పాట్లు చేయాలని సూచన**
- **జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 3:**

దేశంలోని ప్రతీ రహదారిపై కాలినడకన వెళ్లే పాదచారులు ఎలాంటి ప్రమాదాలు, భయం లేకుండా సురక్షితంగా నడిచేందుకు వీలుగా ప్రత్యేక స్థలాన్ని తక్షణమే కేటాయించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన మార్గాలు ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని, అలాగే సాధారణ వాహనాల రాకపోకలు సాగే రహదారి నుంచి వీటిని స్పష్టంగా వేరు చేసి ప్రజలకు కనిపించేలా గుర్తించాలని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పెరుగుతున్న రహదారి ప్రమాదాలు, పాదచారుల భద్రతపై దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున కోర్టులో హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు ధర్మాసనం ఈ విషయమై పలు మార్గదర్శకాలను, సూచనలను అందించింది.దేశంలో ఎక్కడ రహదారి నిర్మించినా లేదా పునర్నిర్మించినా, అక్కడ పాదచారుల కోసం కచ్చితంగా ప్రత్యేక మార్గం ఉండాల్సిందేనని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ ఏర్పాటు కోసం ప్రభుత్వం భారీగా రూ. కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదని అభిప్రాయపడింది. రోడ్డు పక్కన కనీసం తాడు లేదా ఇతర రంగులు, తాత్కాలిక గుర్తులు వేసి అయినా సరే పాదచారుల మార్గాన్ని స్పష్టంగా వేరు చేసి చూపించాలని కోర్టు సూచించింది. ఆ కేటాయించిన స్థలంలో ఎలాంటి చిరువ్యాపారాలు, వాహనాల పార్కింగ్ లేదా ఇతర ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రతీ పౌరుడు తన కోసం కేటాయించిన ప్రత్యేక మార్గంలో వేగంగా వచ్చే వాహనాల భయం లేకుండా చాలా స్వేచ్ఛగా నడిచేలా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఈ కీలక అంశంపై సంబంధిత అన్ని మంత్రిత్వ శాఖలు, అధికారులకు తక్షణమే అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీటికి సంబంధించి తీసుకున్న చర్యలతో సమగ్ర నివేదిక సమర్పించడానికి కేంద్రానికి రెండు వారాల సమయం ఇస్తూ, తదుపరి విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.ఇదివరకు జూన్ 19న కూడా సుప్రీంకోర్టు ఇదే అంశంపై విచారణ జరుపుతూ ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రత్యేకంగా గుర్తించిన ఫుట్‌పాత్‌పై సురక్షితంగా నడవడం అనేది ఈ దేశంలో జన్మించిన ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని తేల్చిచెప్పింది.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) ప్రకారం పౌరులకు లభించిన దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా సంచరించే ప్రాథమిక హక్కుతో పాటు, ఆర్టికల్ 21 ద్వారా ప్రాథమికంగా లభించిన గౌరవప్రదమైన జీవించే హక్కులో కూడా పాదచారుల భద్రత ఒక అంతర్భాగమని సుప్రీంకోర్టు తన తీర్పులో పొందుపరిచింది.అంతేకాకుండా, ప్రత్యేకంగా పాదచారుల కోసం కేటాయించి గుర్తించిన రహదారి మార్గాలలో వేగంగా వెళ్లే మోటారు వాహనాల కంటే కాలినడకన వెళ్లే పాదచారుల హక్కుకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది.కేంద్రానికి ఇచ్చిన రెండు వారాల గడువు తదుపరి చర్యలపై మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఈ తాజా ఆదేశాలతో ఇకపై దేశవ్యాప్తంగా ప్రతీ రాష్ట్రంలోనూ పాదచారుల భద్రత, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ మరియు రహదారుల సరిహద్దుల గుర్తింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని చట్ట నిపుణులు అభిప్రాయపడుతున్నారు.దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో విస్తరిస్తున్న రహదారుల కారణంగా రోజురోజుకూ పాదచారులకు స్థలం కరువై ప్రమాదాల బారిన పడుతున్న తరుణంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రక ఆదేశాలు సామాన్య పౌరుడికి ఎంతగానో ఊరటనిచ్చే అంశంగా నిలిచాయి.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com